సృజనాత్మక రచనలు చేయడం ఎలా?

డార్ల వెంకటేశ్వరరావు

Gratis

సృజనాత్మక రచనలు చేయడం ఎలా?

డా॥ దార్ల వెంకటేశ్వర రావు



Srujanatmaka Rachanalu Cheyadam ela?

(సృజనాత్మక రచనలు చేయడం ఎలా?)

written by Dr.Darla Venkateswara Rao

Lecturer,


Dept. of Telugu, School of Humanities,

UNIVERSITY OF HYDERABAD,

(Central University)

Gachibowli, Hyderabad-500 046.

Andhra Pradesh, India



First Edition: 5 September, 2005

Copies: 500. Price: Rs. 50/-

For Copies :

Dr. Darla Ravi Kumar, Telugu Pandit,

Cheyyeru Agraharam,

Via: Anathavaram (S.O.), E. G. Dist-533 222.

Prajasakti , Visalandhra, Navodaya Book Houses.

ww.vrdarla.blogspot.com, vrdarla@gmail.com

Cover Design: P.V. Kiran Kumar

Printed at : Pravallika Art Printers, Hyderabad.

అంకితం



నా జీవిత భాగస్వామి
మంజుశ్రీ కి ప్రేమతో....

కృతజ్ఞతలు

శ్రీ అనంత పద్మనాభ కళాశాల విద్యార్థులే ఈ పుస్తకం ఇలా రావడానికి ముఖ్య కారణం. కనుక ముందుగా వారికి నా అభినందనలు. ఈ వ్యాసాలను ముందుగా ఆ కళాశాల వార్షిక సంచికలలో ప్రచురించినందుకు కళాశాల యాజమాన్యానికి, కళాశాల ప్రిన్సిపాల్ గార్లకు నా కృతజ్ఞతలు.

అలాగే, డిగ్రీ లెక్చరర్‌గా పనిచేసేటప్పుడు ఈ వ్యాసాలు రాయడంలో అనేక చర్చల్లో పాల్గొన్న నాటి సహ అధ్యాపకుడు డా।। డి. నారాయణ రావు గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. మొదటి నుండీ నన్ను ప్రోత్సహిస్తున్న పత్రికలు, రేడియో, దూరదర్శన్ వారికి అలాగే మా గురువులు డా.ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి, డా।। ద్వానా శాస్త్రి, ఆచార్య పరిమి రామనరసింహం, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మరియు నా సహ అధ్యాపకులకు అందరికీ నా ధన్యవాదాలు.

అన్నింటికీ మించి ఈ పుస్తకాన్ని రాయడానికి సమయాన్నిచ్చి, ప్రచురించడంలో ఎంతో సహకరించిన నా జీవిత భాగస్వామి మంజుశ్రీకీ, మా తమ్ముడు డా।। దార్ల రవికుమార్ కీ నా అభినందనలు.

ముఖచిత్రాన్ని అందంగా డిజైన్ చేసిన మిత్రుడు పి.వి. కిరణ్ కుమార్‌కీ, డిజైన్ చేసేటప్పుడు వివిధ రకాలుగా సహకరించిన మిత్రులు రవికుమార్, శివరామ్ ప్రసాద్ లకూ, పుస్తకాన్ని ప్రచురించిన ప్రవళ్లిక ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు వారికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

విషయసూచిక

ప్రస్తావన

శ్రీఅనంత పద్మనాభ కళాశాలలో పనిచేసేటప్పుడు ఈ రచనకు బీజం నామనసులో పడింది. విద్యార్థినీ, విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని పెంపొందించాలనే ప్రధాన లక్ష్యంతో

శ్రీఅనంత పద్మనాభ కళాశాల వారు ఒక వార్షిక సంచికను ప్రచురిస్తుంటారు. దీనికి ఒక ప్రకటన విడుదల చేసి విద్యార్థినీ విద్యార్థుల నుండి రచనలు ఆహ్వానిస్తారు.

విద్యార్థినీ విద్యార్థుల నుండే ఎడిటర్, అసోసియేట్ ఎడిటర్స్‌ని ఎంపిక చేయడానికి సృజనాత్మక రచనల పోటీ నిర్వహించి, వాటిలో నైపుణ్యం ప్రదర్శించిన వారిని ఎంపిక చేస్తారు. ఒక్కో సబ్జెక్టు నుండి ఒక్కో సలహాదారు (ఎడ్వైజర్)ని కూడా నియమిస్తుంటారు. ఆ సలహాదారుణ్ణి అధ్యాపక వర్గం నుండే తీసుకుంటారు.

అంతిమంగా రచలన్నింటినీ ఎడిటోరియల్ బోర్డు వారు పరిశీలించి, విద్యార్థినీ విద్యార్థుల్నీ ప్రోత్సహించే దిశగా నైతిక విలువలు పెంపొందించుకొంటూ, వ్యవస్థీకృతమైన అభివృద్ధికి దోహదకారి అయ్యే భావనలు ఉన్న రచనలన్నింటినీ సంచికలో ప్రచురణ పొందేటట్లు ప్రయత్నిస్తుంటారు.

కొన్ని రచనల్లో వైయక్తికత కనిపిస్తున్నట్లు ఉన్నా సృజనశీలతకు అవకాశం ఉంటే, శిల్ప పరమైనే అంశాలు ఏ మాత్రం కనిపించినా వాటిని కూడా ప్రోత్సహించడానికే ప్రయత్నిస్తుంటారు.

ఈ నేపథ్యంలో రచనలు చేయడానికి స్టూడెంట్స్ చాలా మంది ఆసక్తి కనబరిచినా, ఎటువంటి వస్తువు (ఇతివృత్తం)ని స్వీకరించాలి?

స్వీకరించిన దాన్ని రచనగా మలచడానికి తీసుకొనే పద్ధతులేమిటి? ఏ ప్రక్రియలోనైనా రచనలు చేయగలమా? లేక కొన్ని ప్రక్రియలను మాత్రమే ఎన్నుకోవాలా? అసలు అన్ని ప్రక్రియల్లోనూ ప్రవేశించడం మంచిదేనా? లేక కొన్ని

ప్రక్రియల్లోనే రచనలు కొనసాగించాలా? మొదలైన సందేహాలు రచనలు చేయడానికి ఉద్యుక్తులైన వారిలో సర్వ సాధారణంగానే కలుగుతుంటాయి.

అలాంటి ప్రశ్నలనే నన్ను విద్యార్థులు అడుగుతుండేవారు. అప్పుడికప్పుడు కొన్ని మెళకువలు చెప్పినా, అడిగిన ప్రతివాళ్ళకీ చెప్పడం కొంచెం ఇబ్బందికరమే అవుతుండేది. అప్పుడు ఆ వార్షిక సంచికల్లో మంచి రచనలు చేయడానికి నాకు తెలిసిన, నేను గమనించిన కొన్ని అభిప్రాయాలను వరసగా కొన్ని వ్యాసాలుగా రాశాను.

ఆ వ్యాసాలు చదివిన విద్యార్థులే కాకుండా అధ్యాపకులు, మరి కొంత మంది సాహితీ వేత్తలు దీన్ని ఒక పుస్తకంగా పెంచి సోదాహరణంగా రాస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు.

ఈ లోగా హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో లెక్చరర్ ఉద్యోగం రావటం, పోయిటిక్స్, విమర్శ పాఠాలను బోధించే అవకాశం కలగడంతో అప్పటి భావాల్ని ఒక పుస్తకంగా ముద్రించాలనే తపన మరింతగా పెరిగింది.

నిజానికి పాఠాలు చెప్పేటప్పుడు, రచనలు చేయడానికి పని కొచ్చే కొన్ని విషయాలు చెప్తున్నా, సృజనాత్మక రచనలు ఎలా చేయాలో, దాన్నిపైనే దృష్టిని కేంద్రీకరించి తరగతి గదుల్లో సర్వసాధారణంగా చెప్పట్లేదు. పాశ్చాత్య దేశాల్లో సృజనాత్మకతను పెంపొందించడం పైనే కొన్ని ప్రత్యేక పాఠ్యాంశాలున్నాయి. కొన్ని విశ్వవిద్యాలయాల్లో సృజనాత్మకతపై పరిశోధనలు కూడా జరుగుతున్నాయి.

మన భారతీయ విశ్వవిద్యాలయాల్లో చిత్రకళ, శిల్పకళ వంటి వాటికిచ్చే తర్ఫీదులో ఒక క్రమబద్ధమైన అధ్యయనం జరుగుతుంది. అలాగే రచనా రంగంలో కూడా జరగవలసిన అవసరముంది. అప్పుడు రచయితలు మరింత బాధ్యతాయుతంగా రచనలను చేయడానికి కృషి చేయడానికి అవకాశం ఉంటుంది.

రచనలలోని నైపుణ్యాన్ని పరిశీలించే దిశగా మన విశ్వవిద్యాలయాలు ఆసక్తిని చూపిస్తున్నాయి. పోయిటిక్స్ పాఠంగా చెప్పేటప్పుడు వివిధ రచనల స్వరూప స్వభావాలను వివరించడం ఒక భాగం. అలాగే, అలంకారాలు, ఛందస్సు, పద్య సౌందర్యం, కవితా సౌందర్యం వంటి వాటిని వివరించేటప్పుడు ఆ రచనలను మూల్యాంకన చేసేటప్పుడూ రచనలు చేయడంలో గల కొన్ని మౌలికాంశాలు వెల్లడవుతుంటాయి.

రాగాన్ని బట్టి పద్యాన్ని అలవోకగా చెప్పే అవధానులు ఉన్నారు. ఇవన్నీ రచనలు చేయడానికి పనికొచ్చే విషయాలే! అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేయకపోయినా, ఆ రచనలను గమనించి కొన్ని మౌలికాంశాలను పసిగట్టి, సృజనాత్మక రచనలు చేసేవారికి మార్గాన్ని సూచించడమే దీని లక్ష్యం. ఇది మీ మన్ననలను పొందుతుందని ఆశిస్తున్నాను.

సృజనాత్మకత అంటే...!

"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథా స్మైరోచతే తథేదం పరివర్తతే " అని
ఆనందవర్థనాచార్యుల వారు "ధ్వన్యాలోకం" లో ప్రవచించారు.

అపారమైన కావ్య ప్రపంచంలో కవి బ్రహ్మ లాంటి వాడు. అంటే బ్రహ్మ లాగే సృష్టి కర్త అని అర్థం. అతడు తన ఇష్టానుసారంగా లోకాన్ని సృష్టించగలడు. సృష్టిలో సృజన ఉంది. సృజనలో భావుకత ఉంది. సృజనలో కల్పన ఉంటుంది. అందువల్ల వీటి మధ్య గల భేద సాదృశ్యాలను అర్థం చేసుకోవడం ముఖ్యం.

వీటిలో సృజనాత్మకత అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానాన్ని ముందుగా అన్వేషిద్దాం! 'సృజనాత్మకత' అనే పదం **creativity** అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా ప్రయోగంలో కనిపిస్తుంది. **"to cause to come into existence'; 'bring into existence'** అని **'create'** అనే పదానికి ఆంగ్ల నిఘంటువుల్లో అర్థాలు కనిపిస్తున్నాయి. **'creation'** అనే ఆంగ్ల పదం 'సృజన, సృష్టి' అనే అర్థాలను స్ఫురింపజేస్తుంది.

తెలుగు నిఘంటువులు "సృజన' శబ్దానికి 'కల్పన, ఉత్పత్తి, నిర్మాణం, సృష్టించు, సృష్టిచేయు, పుట్టించు, కలుగ జేయు, కల్పించు మొదలైన అర్థాలను సూచిస్తున్నాయి. దీన్ని బట్టి "సృజన' అంటే 'లోకంలో లేనిదాన్ని కొత్తగా సృష్టించడం' అని అర్థం చెప్పుకోవచ్చు. అంతకు ముందు లోకంలో లేనిదాన్ని ఊహ ద్వారా గానీ, క్రియాత్మకంగా గాని నిర్మించడం సృజన అవుతుంది.

ఇలాంటప్పుడు లోకంలో లేనిదాన్ని కొత్తగా దేన్ని సృష్టించినా అది సృజనే అవుతుందా? లోకంలోకి వచ్చిన ప్రతీదీ కొత్తదే అవుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. అందుకే దీన్నిలోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

ప్రయత్న పూర్వకంగా గాని, అప్రయత్న పూర్వకంగా గాని స్పందించడం ద్వారా నూతన ఆలోచనలతో లేదా నూతన

భావనలతో హృదయంలో రగిలిన ఒక క్రియాశీలత్వ విధానం సృజనాత్మకతలో ఉంటుంది. సృజనలో మేధోగతంగా గానీ, హృదయస్పందన వల్ల గానీ పుట్టుకొచ్చే కొత్త కొత్త ఆలోచనల పరంపర క్రియాశీలత ఉంటుంది.

సృజన అనేది ఏ ఒక్క రంగానికో సంబంధించింది మాత్రమే కాదు. అది అన్ని రంగాలకు సంబంధించింది. ప్రధానంగా వ్యక్తి ఆలోచనలు, చలనశీలత, అవి క్రియా రూపంలోకి రావడం వంటి వన్నీ మానసిక స్థితి గతులకు సంబంధించినవి కావడం వల్ల మనోవైజ్ఞానిక శాస్త్రం (*psychology*) పరిధిలో దీనికి అత్యంత ప్రాధాన్యత లభిస్తుంది.

సాహిత్యంలో వ్యక్తుల స్పందనలు, ఆలోచనలు మానసిక సంబంధాల్లోనే భాగమవుతాయి. ఆ విధంగా మనోవైజ్ఞానిక శాస్త్రం సాహిత్యానికి అత్యంత సన్నిహితమైన అధ్యయన శాస్త్రమైంది. మనోవైజ్ఞానిక శాస్త్రంలో సృజన, సృజనాత్మక అంశాలపై లోతైన అధ్యయనాలు జరిగాయి. వీటన్నింటిని ఇక్కడ ప్రస్తావిస్తే గ్రంథం చాలా పెరిగిపోతుంది. అవసరమైన అంశాలనే స్పృశించి సృజనాత్మకతను ఎలా అవగాహన చేసుకోవచ్చో వివరించే ప్రయత్నం చేస్తాను.

*Creativity*ని నిర్వచించే ప్రయత్నం చేసిన వాళ్ళున్నారు. *Wikipedia* లో ఇలా వివరించారు.

"Creativity is a mental and social process involving the generation of new ideas or concepts, or new associations of the creative mind between existing ideas or concepts. Creativity is fueled by the process of either conscious or unconscious insight.

An alternative conception of creativeness is that it is simply the act of making something new.
From a scientific point of view, the products of creative thought (sometimes referred to as divergent thought) are usually considered to have both originality and appropriateness."

"Creativity is a mental and social process involving the generation of new ideas or concepts, or new associations of the creative mind between existing ideas or concepts. Creativity is fuelled by the process of either conscious or unconscious insight. An alternative conception of creativeness is that it is simply the act of making something new.

From a scientific point of view, the products of creative thought (sometimes referred to as divergent thought) are usually considered to have both originality and appropriateness."

సృజన అనేక రంగాలకు సంబంధించినదని ముందే చెప్పుకున్నట్లు దాన్ని వివిధ రకాలుగా వివరించే ప్రయత్నం చేశారు.

సృజన అనేది కేవలం మేధోపరమైనదని మాత్రమే చెప్పలేం. సామాజిక పరిస్థితుల్ని బట్టి ఏర్పడే నూతన ఆలోచనలు, భావనలు కూడా సృజనాత్మకతలో భాగమవుతాయి. అప్పటికే ఉన్న ఆలోచనలు, లేదా భావనలతో కలిసి లేదా వాటికి భిన్నం గాగాని కొత్త రూపు దాల్చే విధంగా గాని మారవచ్చు.

సృజన కేవలం ప్రయత్న పూర్వకంగానే కాకుండా అప్రయత్న పూర్వకంగా కూడా జరగవచ్చు. ఎలా జరిగినా కొత్తదనమనేది దానిలో ముఖ్యం. లేని దాన్ని ఉనికిలోకి తీసుకొనిరావడాన్ని సృజనాత్మక శక్తి అంటారు.

"Creativity is now most commonly defined as the mental capacity to produce something new and valuable. While this is similar to the concept of original genius, it is based on a democratisation of genius. Creativity is not the gift of a talented few but a latent faculty in everyone and applicable to any field of human endeavour"

(Paul Dawson 2005:45)

సృజనాత్మక సాహిత్యం పై పరిశోధన చేసిన పాల్ డావ్‌సన్ అభిప్రాయం కూడా సృజనాత్మకత అనేది మేధోపరమైన శక్తిగాను, పుట్టుకతో పాటు అలవడేదే కాకుండా ప్రయత్నిస్తే అందరికీ సాధ్యమయ్యేదని అర్థమవుతుంది.

సృజనాత్మకతలో కాల్పనికత ఉండవచ్చు. కానీ, కాల్పనిక రచనలన్నీ సృజనాత్మక రచనలు కానవసరం లేదనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి.

మహాభారతం కథను చెప్పే ప్రణాళికలో గొప్ప సృజనాత్మక నైపుణ్యం ఉంది. అలాగే పింగళి సూరన రాసిన "కళా పూర్ణోదయం" లోనూ భావుకత ఉంది.

సృజనాత్మకత ఇలా అన్ని రంగాలకు సంబంధించింది అయినప్పటికీ సాహిత్యంలో ఈ పదాన్ని విరివిగా వాడుతున్నారు. వ్యాకరణం, భాష, విమర్శ వంటి వాటిని తప్ప మిగిలిన

కవిత్వం, కథ, నవల, నాటకం వంటివన్నీ సృజనాత్మక ప్రక్రియలుగానే ప్రాచుర్యంలో ఉన్నాయి.

సాధారణ వ్యవహారంలో కూడా దీన్నే సృజనాత్మక సాహిత్యం అని పిలుస్తుంటారు. అందువల్ల సాహిత్య పరిధి లోనే సృజనాత్మక అంశాలను గమనించడం జరుగుతుంది.

సృజనసోపానాలు

ఏ పని చేయడానికైనా, ఆ పని పట్ల మనకి ఆసక్తి ఉండాలి. అలాగే రచనలు చేయాలనే ఆసక్తి, ఉత్సాహం మనలో ఉండటం ముఖ్యమని గమనించాలి. ఆసక్తి అనేది మన పరిసరాలను బట్టి మన చుట్టూ ఉండే పరిస్థితులను బట్టి కూడా కలుగుతుంటుంది.

ఒక మంచి దృశ్యాన్ని చూసినపుడో, ఒక మంచి రచనను చదివినపుడో, గొప్ప వ్యక్తి గురించి తెలుసుకున్నప్పుడో మనకు కలిగే అనుభూతులను మనకు తెలిసిన పదాల్లోనే మన డైరీలో రాసుకుంటుండాలి. అవసరమైతే ఆలోచన వచ్చినప్పుడే దాన్ని ఏదైన కాగితం మీద, మనకు నచ్చినట్లు తాత్కాలికంగా రాసుకొని తర్వాత దాన్ని సరిచేసుకోవచ్చు.

రాత్రంతా కలలు కని తెల్ల వారిన తర్వాత కాగితాలు కాగితాలు చింపేస్తూ, ఇంక్ అంతా అయిపోయేటట్లు ఏవో పిచ్చి గీతలు పెట్టేయడం వల్ల రచనలు వెలువడవు. మనకి వచ్చిన భావాల్ని వెంటనే ఏదొక రూపంలో రాసుకుంటుండాలి. అందుకనే జేబులో ఎప్పుడూ ఒక పెన్నూ, దానితో పాటు చిన్నపుస్తకమో, కాగితమో పెట్టుకోవడం మంచిది.

డైలీ డైరీ రచన:

మనం రోజూ అనేక సంఘటనలు చూస్తూంటాం, అనేక మంది వ్యక్తుల్ని కలుస్తుంటాం. భిన్న మనస్తత్వాల గల వాళ్ళు మనకి తారసపడుతుంటారు. కొన్ని సార్లు జీవితంలో మరిచిపోలేని సంఘటనలు కూడా ఎదురవుతుండవచ్చు. వాటిని మరిచి పోకుండా మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకోవడానికైనా మనకి తెలిసిన భాషలో మన డైరీలో ఏ రోజుకారోజు రాసుకొంటుండాలి.

డైరీ రచన అనగానే పొడి పొడి పదాలతోనే, సంకేతాలతోనో, చిట్టా పద్దుల్లాగానో కాకుండా, వాక్యాలు వాక్యాలుగా రాసుకొంటుండాలి.

కొన్ని సార్లు మంచి కలర్ పెయింటింగ్‌ని చూడవచ్చు. మంచి సినిమా చూడొచ్చు. గొప్ప వ్యక్తిని కలవచ్చు. ఇలా

మనసుకు నచ్చిన అంశాలను వర్ణనాత్మకంగా మన అభిప్రాయాల్ని రాసుకుంటుండాలి. వర్ణన అంటే అలంకారాలు ఉండాలనేమి లేదు. అవన్నీ మనకు తెలియక పోయినా కొన్నింటిని మరి కొన్నింటితో పోలుస్తూ రాసుకొంటుంటే, వాటికవే అమరిపోతుంటాయి. తర్వాత రమణీయమైన శైలిని శాస్త్రీయంగా అవగాహన చేసుకోవచ్చు. సంజీవ్ దేవ్ రచనల్లో ఈ లక్షణం కనిపిస్తుంటుంది.

మన తెలుగు సాహితీ వేత్తలకు డైరీ రచన అలవాటు ఉంది. అలాగే, గురజాడ అప్పారావు గారికి డైరీ (దిన చర్య) రాసుకొనే అలవాటు ఉంది. ఆయన రాసుకున్న ఒక రోజు డైరీ విశేషాలు ఎలా ఉన్నాయో చూడండి.

24-6-1896.

రీవా మహారాణిగారు కొందరు రైతులను తగాదాల పరిష్కారం కోసం మేనేజరు గారి వద్దకు పంపించారు. మేనేజరు వద్దకు వెళ్ళినప్పుడు చాలా సేపు వేచి ఉంచారు. తరువాత డబ్ల్యూ నన్ను రమ్మనమని చెప్పారు. నేను వెళ్ళి తిరిగి ఇది ఏమిటని అడిగాను. ఈ రైతుల్ని మేనేజరుగారి వద్దకు తీసుకువెళ్ళమని చెప్పారు. ఈ విషయం గురించి నాకేమి తెలియదు.

డబ్ల్యూ: ఎందుకు మీరు నన్ను చూడాలనుకున్నారు

నేను: మిమ్మల్ని నేను చూడాలని అనుకోలేదు.

డబ్ల్యూ: ఈ విషయంలో చర్య తీసుకోవలసింది నేను. మేనేజరు కాదు. మీరెందుకు ఆయన దగ్గరకు వెళ్ళారు.
ఇటువంటి పనులు నేను సమ్మతించను.

నేను: (వారికిది ఇష్టం) అయ్యా ఈ విషయం గురించి నాకేమి తెలియదు.

డబ్ల్యూ: నాకు తెలుసు దీనికంతటికి కారణం మీరే.

నేను: అయ్యా మీకు హామి ఇస్తున్నాను. దేవుని మీద ప్రమాణంగా నాకేమీ తెలియదు. మీరు ఇటువంటి అభిప్రాయానికి వచ్చినందుకు నేను విచారిస్తున్నాను.

డబ్ల్యూ: మీరు వెళ్ళవచ్చును.

ఈ లేఖను మీరు గమనిస్తే చాలా సులభంగా, తనకూ, డబ్ల్యూకీ మధ్య జరిగిన సంభాషణను రాసుకున్నారు.

ఇలా జరిగిందాన్ని జరిగినట్లు దిన చర్యను రాసుకోవడం వల్ల నాటకానికీ, కథల్లోనూ చక్కటి సంభాషణలు రాసుకోగలిగే శక్తిని సంపాదించవచ్చు.

పై దినచర్యను గురజాడ రచలు పేరుతో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు 2000లో ప్రచురించిన "జాబులు జవాబులు, దిన చర్యలు గ్రంథం పుటలు 124 125 నుండి గ్రహించాను.

పరిశీలన:

ప్రతి రచనలోనూ "పరిశీలన' ప్రతిబింబిస్తుంటుంది. అంటే, ఆయా రచనలు చేసే వారిలో గల నిశిత పరిశీలనలే నిజమైన ఆకర్షణీయాలవుతాయి దీన్నే "నఖశిఖపర్యంతం" అన్నట్లు రచనలు చేయాలనుకున్న వాళ్ళు అన్ని విషయాలను అన్ని కోణాల నుండి పరిశీలిస్తుండాలి. ఒక స్త్రీని వ్యభిచారి అని అన్నారనుకోండి.

వ్యభిచారం అంటే ఏమిటి? ఆ పరిస్థితులకు కారణాలేమిటి?ఆమె మాత్రమే ఆ పని ఎందుకు చేయాలనుకున్నది. ఆ పని తప్ప మరో మార్గం ఆమెకి

కనిపించలేదా? ఎందువల్ల అలా అయ్యింది? ఆర్థిక పరిస్థితి వల్లా? ఎవరైన కొందరి మోసం వల్ల ఊబిలో దించబడిందా? ఉన్ని సోషల్ స్టేటస్‌గా భావించిందా? ఏదైన పోటీ వల్ల చేసిందా? అలా ముద్ర వేయబడిందా? ఇదే పని ఒక పురుషుడు చేస్తే ఈ సమాజం ఎలా ప్రతి స్పందించి ఉండేది? ఇలా అనేక కోణాల నుండి పరిశీలించడం అవసరం.

భాషపై అధికారం - స్పష్టత:

మనం ఏ భాషలోనైనా రచనలు చేయవచ్చు కాని, ఏ భాషలో రచనలు చేయాలన్నా, ఆ భాషపై అధికారం సంపాదించాలి. అంటే కనీసం ముందుగా ఆ భాషలో తప్పులేకుండా రాయగలగాలి.

సన్నివేశాలు, సంఘటనలను బట్టి పాత్రలను అనుసరించి చిన్న చిన్న వాక్యాల్లో రాయాలా? పెద్ద వాక్యాల్లో రాయాలా? వ్యవహారికంలో రాయాలా? గ్రాంథికంలో రాయాలా? సమకాలీనంగా వ్యవహారంలో ఉన్న భాష ఏమిటి? మనం పాత్ర చేత భాషను పలికించేటపుడు ఆ పాత్ర గల వ్యక్తి ఏ కులానికి చెందినవాడో? ఏ మతానికి చెందినవాడో? లేక ఏ ప్రాంతానికి చెందినవాడు? ఏ దేశానికి చెందినవాడు? వంటివన్నీ రచయిత సందర్భోచితంగా గమనించి భాషను ప్రయోగించవలసి ఉంటుంది.

ఇవన్నీ తెలిసి రాస్తే సహజత్వం ఉంటుంది. సహజత్వంలో జీవం ఉట్టి పడుతుంది. ఒక ముస్లిం వ్యక్తి కొత్తగా తెలుగు నేర్చుకొని, కొన్నాళ్ళు తెలుగు వాళ్ళతో ఉన్నపుడు, ఆ భాషలో పారశీక, ఉర్దూ, తెలుగు, హిందీ భాషా పదాలు

మిశ్రమమై ఉండే అవకాశం ఉంది. అదే విధంగా రాయడంలో సహజత్వం ఉంటుంది.

నేటి ముస్లిం వచన కవిత్వంలో ఈ గుణం స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ సందర్భంగా గుర్తుంచుకోవలసిన మరో అంశమేమిటంటే, ఎంత సహజత్వం కోసమైనా, మనం కథ / నవల / కవిత ఏదైనా, ఏ భాషలో రాస్తున్నామో, ఆ భాష చదివే వారికి అర్థం కావటం కూడా ప్రధానమే!

వివిధ దేశాలకు చెందిన వాళ్ళు ఓ చోట కలుసుకొని మాట్లాడుకునే సంభాషణకి ఆ దేశాల్లో వాడుకలో ఉన్న భాషను మాత్రమే ప్రయోగిస్తే "సహజత్వం' ఎలా ఉన్నా, అది ఏ భాషో తెలియక పాఠకుడు అయోమయంలో పడిపోయి విసుగొచ్చి దాన్ని చదవడం మానేయవచ్చు.

సహజత్వం అనేది కేవలం ఆ భాషలోనే రాయాలని కాకుండా ఆ ప్రాంత అలవాట్లు వంటి వాటిని కూడా మనం రాసే భాషలో పెట్టి సహజంగా రాయవచ్చు. దీని వల్ల స్పష్టతకి నష్టం కలగకుండా అవగాహనకు ఎంతో సావకాశం కలిగి పఠనాసక్తి పెంపొందుతుంది.

కొన్ని సార్లు మన పేరును బట్టి కూడా పాఠకుల్లో "రచన'ను చదవాలని అనుకుంటుంటారు. మన శైలి, మంచి భాష, మంచి భావాలు, విశ్లేషణలు తీసుకొనే ఇతివృత్తాలు ఆకర్షణకు ప్రధాన కారణాలవుతుంటాయి.

సృజనాత్మ రచనలు చేయాలను కొనే వాళ్ళు మంచి భాష అలవడడానికి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, చలం, రావిశాస్త్రి, కొలకలూరి ఇనాక్, ఓల్గా, కుప్పిలి పద్మ మొదలైన

వాళ్ళు కథలు చదివితే మంచి భాష, శైలి అలవడుతుంది.

కవిత్వం రాయాలనుకునేవాళ్ళు అదీ పద్య కవిత్వం రాయాలనుకునేవాళ్ళు నన్నయ, పోతన, శ్రీనాథుడు, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువ, వేమన, కరుణశ్రీ మొదలైన వారి పద్యాలను చదవడం ద్వారా చక్కని పద్యాలను రాయగలుగుతారు.

అలాగే వచన కవిత్వం రాయాలను కునేవాళ్ళు కుందుర్తి, బాలగంగాధర్ తిలక్, శ్రీశ్రీ, కరుణశ్రీ, అజంతా, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, సతీష్ చందర్, కొండేపూడి నిర్మల, హైమవతి తదితరుల రచనలు శిక్షణకు ఉపయోగపడతాయి. వీటిలో చక్కటి భాష, శిల్ప నైపుణ్యం, ఇతివృత్త వైవిధ్యం కనిపిస్తూ కొత్తగా కవిత్వం రాయాలనుకునే వాళ్ళకు కరదీపికలుగా ఉపయోగపడతాయి.

మంచి రచనలు చదవడం:

పుడుతుండగానే మాట్లాడలేమన్నట్లు గానే మనం మాట్లాడాలంటే ఎలా మాట్లాడాలో, మాట్లాడే వారిని అనుకరిస్తూ బాగా మాట్లాడడం నేర్చుకుంటుంటాం! అలాగే మంచి రచన చేయాలనుకునే వారంతా ముందుగా చేయవలసిన పని మంచి రచనలు చదవడం. దీనివల్ల అనేక ప్రయోజనాలున్నాయి.

లోకంలో చాలా చిన్న విషయంగా కనిపించేది కూడా, ఒక అద్భుతమైన "రచన'గా ఎలా రూపొందించుకోవచ్చునో తెలుస్తుంది. మనం ఏ ప్రక్రియలో రచనలను చేయాలనుకుంటున్నామో, ఆ రచనా ప్రక్రియకు సంబంధించిన శిల్పాన్ని అవగతం చేసుకోవచ్చు. ఒక ఇతి వృత్తాన్ని పాఠకుని

మనసుకి ఆహ్లాదం కలిగేటట్లు ఆలోచన పుట్టేట్లు రమణీయంగా వివరించగలగడం శిల్పం. ఇదే శిల్పం అని చెప్పడం కూడా సాధ్యం కాదు.

శిల్పమనేది ఒక్కొక్క రచయితకూ, కవికీ ఒక్కొక్క విధంగా కూడా ఏర్పడుతూ తనదైన ముద్రను ఏర్పరచుకుంటుంది. కనుక, ఆ ప్రక్రియలో చేయి తిరిగిన వారి రచనల ఎంపిక చేసుకొని, వీటిని మామూలుగా చదవటం ఒక రకమైతే, పరిశీలనాత్మకంగా చదవడం మరొక రకం. కేవలం కథనో, భావుకతనో ఆహ్లాదం గానో మనోహరంగా ఆస్వాదించగలిగేటట్లు చేసేది మొదటి రకం పఠనం.

ద్వితీయ పఠనంలో ఎలా ప్రారంభించారు? ఎలా ముగించారు? మధ్యలో ఎలా ఉంది? ఇతివృత్తం ఎలాంటిది? తీసుకున్న ఇతివృత్తాన్ని ఎలా వర్ణించారు? పాఠకునికి అందించడంలో తీసుకున్న జాగ్రత్తలేమిటి? వంటి వాటిని అన్నింటినీ అవగాహన చేసుకొంటూ, ప్లాన్ ఎలా వేసుకున్నారనేది అర్థం చేసుకోవాలి! దీన్నే ప్లాట్ అంటారు.

అనేక సంఘటనలను తీసుకున్నారా? ఒకే సంఘటనను తీసుకున్నారా? అనేక పాత్రలున్నాయా లేదా ఏక పాత్ర చుట్టూనే కథ నడుస్తుందా? వంటి వాటిని కూడా అర్థం చేసుకోవాలి.

ఉత్తమ పురుష కథనమా? మధ్యమ పురుష కథనమా? కథా కథనమా? సంభాషణాత్మకంగా వర్ణిస్తున్నారా? పాత్రలతోనే నడిపిస్తున్నారా? నాటకీయంగా రాస్తున్నారా? వంటి శైలీ భేదాల్ని కూడా పరిశీలించాలి. పోరంకి దక్షిణామూర్తి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య మొదలైన వాళ్ళు కథాశిల్పంపై మంచి

పుస్తకాలు రాశారు. వీటిని జాగ్రత్తగా పరిశీలిస్తే కథ రాయడంలో ఉన్న మెళకువలు బాగా తెలుస్తాయి. దీని వల్ల మనం రాసేటప్పుడు వచ్చే అనేక సందేహాలు తీరిపోతుంటాయి.

వర్క్ షాప్స్ & మీటింగ్స్ :

రచనలు చేయాలనుకునే ఆసక్తి ఉండీ ప్రముఖ రచనలు చదివి, రాయడానికి భావుకత ఉండి కూడా దాన్ని అక్షర రూపంలోకి మార్చలేక పోవచ్చు. స్వయంగా రచనలు చేయడం గురించి ఉన్న పుస్తకాల్ని చదివి అర్థం చేసుకోలేని వాళ్ళు కూడా ఉండవచ్చు.

ఇవేమీ తెలియకుండా తనదైన బాణీలో రచనలు చేసేవాళ్ళు కూడా ఉన్నారు. కానీ, "గురువు లేని విద్య గుడ్డి విద్య" అన్నట్లు రచనలో అధ్భుతమైన కళాత్మకత ఉన్నా శిక్షణ లేక పోవడం వల్ల కొన్ని సార్లు కొన్ని లోపాల్ని చేసే అవకాశం లేకపోలేదు. శిక్షణ ఉంటే మరింత అద్భుతమైన కళాఖండాన్ని అందించవచ్చు. ఆదర్శ ప్రాయంగా నిలవవచ్చు. ఏది ఎందుకు చేశామో, ఎలా చేశామో అవసరమైతే వివరించి చెప్పవచ్చు. దీన్నే క్రమబద్ధమైన అధ్యయనం అంటారు.

పాఠశాల, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో విద్యా విషయకంగా మాత్రమే వారి పరిధిలో పాఠాల్ని బోధిస్తారు. ఏదో కొంత మంది తప్ప చాలా మంది పాఠ్యాంశాల్ని పూర్తి చేయాలనే చూస్తుంటారు. ఏవో కొన్ని ప్రత్యేక కోర్సుల్లో అయితే ఆయా ప్రక్రియల గురించి సమగ్రమైన అధ్యయనం చేయడానికి అవకాశం కలుగుతుంది. తీరా ఆ ప్రక్రియ గురించి పరిజ్ఞానం సంపాదించినంత మాత్రం చేత ఆ ప్రక్రియల్లో ఉత్తమ కళా

ఖండాలుగా నిలిచే రచనలు వారి నుండే వస్తాయనుకోలేం. అలారావడం చాలా అరదుగా జరుగుతుండవచ్చు.

వృత్తిగా నేర్చుకోవడమో పరిశోధనాత్మకంగా అధ్యయనం చేయడమో, రచనలు చేయాలనుకొనే వారికి ఆ రంగంలో విద్యా విషయక పరిజ్ఞానం వంటిది మాత్రమే అర్హతలు కాకుండా, ఆసక్తి, అవగాహన ఉన్నట్లయితే ఎవరైనా రచనలు చేయవచ్చు. దీన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వారు కొన్ని స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలు కూడా రచయిత లేదా రచయిత్రుల వర్క్ షాప్స్ నిర్వహిస్తున్నాయి.

పది నుండి పదిహేను రోజుల పాటు ఆయా ప్రక్రియల్లో నిష్ణాతులైన వారి చేత సూచనలు, సలహాలు, మెళకువలకు సంబంధించి ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. ఆ శిభిరంలో పాల్గొన్న వారి చేత స్వయంగా రచనలు చేయించి, లోటుపాట్లను పరిశీలించి మంచి సలహాలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు.

శిబిరంలో పాల్గొనలేని వారు కూడా ఆయా ప్రక్రియల్లో నిష్ణాతులైన వారిని వ్యక్తిగతంగా కలిసి తమ రచనల్ని చూపించి సలహాలు, సూచనలు పొందడం ద్వారా కూడా మంచి రచనలు చేయగలిగే అవకాశం ఉంది.

ప్రక్రియ ఎంపిక:

రచనలు చేయాలనుకొనేవాళ్ళు సాధారణంగా ఎవరినో ఒక రచయిత లేదా రచయిత్రిని ఆదర్శంగా తీసుకొని, అలా నేనూ రచనలు చేయాలనుకునో అంత మంచి పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించాలనుకొనో రచనలు చేస్తుంటారు.

అలా అనుకోవడం మంచిదే. కానీ, మన పరిజ్ఞానం ఆ

ప్రక్రియకు సరిపోతుందో లేదో ముందు మనల్ని మనం అంచనా వేసుకోగలగాలి. ఆ విభాగంలో బాగా కృషి చేయాలి. అంకుఠిత దీక్షతోనైనా దాన్ని సాధించగలగాలి. అలా అయితేనే మనం అనుకున్న ప్రక్రియలో ఒక స్థానాన్ని పొందగలగటం సాధ్యమవుతుంది. పద్యమంటే ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేకుండా పద్యాలు రాయటానికి సిద్ధమవడమో, నాటకమంటే ఏమిటో తెలియకుండా నాటక రచన చేసేయడానికి ఉద్యుక్తులవడమో, పాటలో పల్లవి, చరణాలంటే ఏమిటో కూడా తెలియకుండా పాట రాయడం వంటివి శాస్త్రీయమైనవి కాదు. ఆ ప్రక్రియలో కనీస పరిజ్ఞానమైనా సంపాదించాలి. అపుడు మాత్రమే ఆ ప్రక్రియలో మంచి రచనల్ని చేయగలుగడం సాధ్యమవుతుంది.

ప్రస్తుతం వచన కవిత్వం బాగా వ్యాప్తిలో ఉంది కాబట్టే ఏవో నాలుగైదు లైన్లు వరుసగా పేర్చి రాస్తే అది వచన కవిత్వం అయిపోతుందనుకోకూడదు. కేవలం ఛందస్సు సరిపోయేటట్లు రాస్తే పద్యం అయిపోదు.కవిత్వానికి "భావుకత' చాలా ప్రధానమైంది. కవిత్వం నూతనమైన సృష్టి. కొత్త ఆలోచనలతోను అందించగలగాలి.

కేవలం సంభాషణలు పెట్టేసినంత మాత్రానా నాటకం అయిపోదు. సన్నివేశ కల్పన కావాలి. సంభాషణతో పాటు ఇతివృత్తాన్ని నడిపించుకోంటూ పోవాలి. రస సృష్టి జరగాలి. ఆనందమో, సందేశమో అందించగలగాలి.

రచయిత లేదా రచయిత్రికి ఒక దృక్పథం అనేది కూడా చాలా ప్రధానం. ఏ రచన అయినా ఎందుకు చేయాలో, ఎలా చేయాలో చేయడంలో ఉండే బాధ్యతల్ని కూడా గుర్తించాలి.

సృష్టికి కల్పనకీ తేడా ఉంది. కథలు, నవలలు కేవలం కల్పనలు కాదు, అలాగని వాస్తవిక విషయాలూ కాదు. వీటిలో రెండింటి స్వభావమూ ఉంది. కొన్నిసార్లు "కేవలం కల్పన''ల్లో కూడా రచయిత లేదా రచయిత్రి దృక్పథాన్ని బట్టి అద్భుత కళా ఖండమవుతుంది.

కవిత్వం, గేయం, నాటిక, కథా, నవల, నాటకం, వ్యాసం వంటి ప్రక్రియల్లో బాగా శిక్షణ పొందడానికు కూడా రచనలు చేస్తుంటారు. వాటిలో కొన్నింటిలోనే వాళ్ళు విజయవంతం అవుతుంటారు. అంటే, ఆ రచనల్లో ఏది ఆసక్తిగా పాఠకుణ్ణి చదివించగలిగిందో అది కొంతవరకూ విజయవంతం అయినట్లే! దాన్ని ఒక్కదాన్నిబట్టే ఆ ప్రక్రియలో విజయవంతం అయినట్లు నిర్ధయానికి వచ్చేయలేం.

ఒక రచన మంచి రచన అని చెప్పడానికి ఇవే ప్రమాణాలని శాసించలేం. కానీ ,ఆ రచన బాగా ఆలోచింపచేయగలిగాలి. దాని ప్రభావం మనిషిని వెంటాడాలి. ఆ మనిషిలో మార్పుకి ప్రేరేపించాలి. ఒక వ్యక్తి గురించే రాసినట్లు ఉన్నా అది తన గురించే రాశారేమో అన్నట్లుండాలి.

అది కేవలం ఒక కాలానికే చెందిన రచనగా మిగిలిపోకుండా జాగ్రత్త పడితే ఇంకా మంచిది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కుల, మత, ప్రాంత స్పర్శ తప్పక పోయినా, సాధ్యమైనంతవరకూ విశ్వజనీన అనుభూతిని చొప్పించగలగాలి. అలాంటి రచన ఉత్తమ రచనగా గుర్తించబడుతుంది. మరో రచన అలాంటిది వెలువడితే బాగుంటుందనిపిస్తుంది. అది నిజమైన సక్సెస్!

ప్రక్రియల పరిచయం అవసరం!

తెలుగులో కవిత్వం, కథ, నవల, నాటకం వంటి వన్నీ ప్రక్రియలు. వాటి స్వరూప స్వభావాలు వేరు వేరుగా ఉంటాయి.

కవిత్వంలోనూ పద్య, వచన, మినీ, గజల్, రుబాయి, దీర్ఘ కవిత, హైకూ వంటి రూపపరమైన భేదాలేన్నో ఉన్నాయి.

వీటి స్వభావాన్ని బట్టి పురాణం, ఇతిహాసం వంటి అనేక భేదాలున్నాయి. వీటన్నింటినీ కలిపి కావ్య భేదాలని పిలుస్తుస్తుంటారు. రచనలు చేయాలనుకొనే వాళ్ళు వీటి మౌలిక తత్త్వాన్ని అవగాహన చేసుకోవడం చాలా అవసరం.

కవిత్వం రాసేవాడు కవి. మరి కవి అంటే ఎవరు? అని ప్రశ్నించుకున్నప్పుడు లోతుగానే ఆలోచించవలసి వస్తుంది. ''కవయతే ఇతి కవి:'' అని చాతుర్యం తో వర్ణించేవాడు అని పండితులు దీనికి వ్యుత్పత్తిని చెప్పారు.

కవిని ఋషితో పోల్చిన వాళ్ళున్నారు. ఋషి తత్త్వదర్శనం చేస్తాడు. అలాగే కవికూడా తాను భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు సంబంధించిన సత్యాలను దర్శిస్తూ రచన కొనసాగిస్తాడు. అందువల్ల అతడిని ఋషి తుల్యుడుగా భావించారు. గెడ్డం మీసాలున్నవాడే ఋషి అని అకోకూడదు. ఏదైనా ఒక విషయాన్ని రమణీయంగ వర్ణించాలనుకున్నప్పుడు ఏకాగ్రత కలిగి ఆ పనిని నిర్వహించగలిగే వాడని అర్థం.

సృజనాత్మక సాహిత్యంలో కవిత్వం ఒకటి. కవిత్వాన్ని రకరకాల రూపాల్లో రాయొచ్చని అనుకున్నాం కదా! సాధారణంగా కవిత్వాన్ని ఛందో బద్దంగా రాస్తే దాన్ని పద్య కవిత్వం అంటారు.

ఛందస్సు కంటే అనుభూతి, స్పందనలకే ప్రాధాన్యాన్నిచ్చి వచనంలో కూడా కవిత్వం రాయొచ్చు. దాన్ని వచన కవిత్వం అంటారు. అలాగే గేయంలోనూ కవిత్వం ఉంటుంది. మినీ కవిత్వం, దీర్ఘ కావ్యం ఇలా రక రకాలుగా కవిత్వాన్ని రాసే అవకాశం ఉంది. ఇలాంటప్పుడే కవిత్వం అంటే ఏమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది.

కవిత్వం అంటే ఏమిటో కావ్యశాస్త్రంలో రకరకాల నిర్వచనాలు కనిపిస్తున్నాయి. భారతీయ ఆలంకారికులు కావ్యాన్నే నిర్వచించినా, దానిలోనూ కవిత్వం గురించే చర్చించారు. పాశ్చాత్యులు కావ్యం కంటే కవిత్వం గురించే స్పష్టంగా నిర్వచించే ప్రయత్నం చేశారు. దీని గురించి ఇప్పటికే రకరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

కవిత్వాన్ని, కావ్యాన్ని లాక్షణికులు ఎలా నిర్వచించారో చాలా మంది వివరించారు. డా .సి. నారాయణ రెడ్డి గారు తన సిద్ధాంత గ్రంథం "ఆధునికాంధ్రకవిత్వము: సంప్రదాయము. ప్రయోగాలు" అనే గ్రంథంలో కూడా చర్చించారు.

కవిత్వాన్ని తొలిసారిగా నిర్వచించిన పాశ్చాత్య లాక్షణికుడు అరిస్టాటిల్. ఇతడు కవిత్వాన్ని (కళలన్నింటిని) ప్రకృతికి అనుకరణం అన్నాడు. అరిస్టాటల్ ప్రత్యేకించి ఒక సూత్రంలో ఈ విషయం చెప్పకపోయినా ఆ భావాన్ని ఆధారంగా చేసికొని కవిత్వాన్ని, కళలను, వాటి స్వరూప స్వభావాల్ని నిర్ణయించాడు ఇతనిది అనుకరణ సిద్ధాంతం. దీన్ని ఇంగ్లీషులో *Imitation Theory* అంటారు .

కవిత్వం ఆవేశానికి సంబంధించిందని ఆ కోణంలో కొంతమంది అనుభూతిని (*Feeling*), ఆవేశాన్ని (*Emotion*) పురస్కరించుకొని చేసిన కవిత్వాన్ని నిర్వచించే ప్రయత్నం చేశారు.

Poetry is 'the spontaneous overflow of powerful feelings' - Wordsworth. (తీవ్రానుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వం.)

'But the thought and words in which emotion spontaneously embodies itself.' - J.S. Mill.(ఆవేశం, స్వచ్ఛందంగా రూపొందిన శబ్దార్థాలు కవిత్వం.)

'A vent for over - charged feeling.' - Keble.
(ఉప్పొంగు అనుభూతుల అభివ్యక్తి కవిత్వం.)

'The suggestion by the imagination of noble grounds for the noble emotions' - Ruskin. (ఊహ ద్వారా ఉదాత్తావేశాలకు ఉత్తమాలంబనం కల్పించేది కవిత్వం.)

ఊహా శక్తిని *(Imagination)* పురస్కరించుకొని చేసిన నిర్వచనాలు కూడా కనిపిస్తున్నాయి.

'In a general sense may by defined as the expression of the imagination' - Shelly.(ఊహా శక్తి ప్రకటనమే కవిత్వం.)

'The language of the imagination' - Hazlitt.
(ఊహా శక్తి పలికెడు శబ్ద సందోహమే కవిత్వం.)

లయను *(Rhythm)* దృష్టిలో పెట్టుకొని చేసిన నిర్వచనాలు ఉన్నాయి.

'(Poetry) We will call musical thought' Carlyle.(సంగీతాత్మకమైన ఆలోచనమే కవిత్వం.)

'The rhythmic creation of Beauty' - E.A. Poe.
(లయ బద్ధమైన సౌందర్య సృష్టి కవిత్వం.) శబ్దం *(Word)* దృష్ట్యా చేసిన నిర్వచనాలు ఉన్నాయి.

'By Poetry we mean the art of employing words in such a Danner as to produce an illusion on the imagination, the art of doing by the means of words the

painter does by means of colours'. - Macaulay.

(భావనా శక్తిని భ్రాంతులతో నింపు విధంగా శబ్దాలను ప్రయోగించుటం, చిత్రకారుడు వర్ణాల ద్వారా సాధించే దాన్ని శబ్ధాలతో సాధించటం కవిత్వం)

వ్యక్తీకరణంను (*Expression*) దృష్టిలో నిడికొని చేసిన నిర్వచనాలు కూడా కనిపిస్తున్నాయి.

'The most delightful and perfect form of utterance that human words can reach' - Arnold.

చాలా మంది నిత్యం సహస్రనామావళిని మననం చేయడం, దైవ స్తోత్రాలను పఠించడం జరుగుతుంటుంది. అది కూడా శబ్ద జ్ఞానాన్ని, ధారణా శక్తిని పెంచుతుంది. వారిలో ఒక రకమైన యోగ శక్తి ప్రవేశిస్తుందని నమ్ముతారు. నిత్యం దైవ భక్తి పేరుతో శ్లోకాల్ని చదవడం, మననం చేసుకోవడం, దృష్టిని కేంద్రీకరించడం ఇవన్నీ ధ్యానంలో భాగమే!

ధ్యానం జ్ఞానానికి తీసుకెళ్ళే మార్గం. ధ్యానం చేసే వాళ్ళు మానసికంగా కూడా ప్రశాంతతను సాధించగలుగుతారు. వారిలో ధారణా శక్తి కూడా పెరుగుతుంది. అంటే జ్ఞాపక శక్తి వృద్ధి పొందుతుందన్న మాట! ఆ రకంగా ఛందో బద్ధంగా పద్యాలు రాసే వాళ్ళు దైవ శక్తి వల్ల కవిత్వం రాయగలుగుతున్నామని చెప్పే అవకాశం ఉంది.

మన కవులు అత్యధిక మంది దైవ శక్తి వల్లనే కవిత్వం అలవడిందని చెప్తుంటారు.

మొల్ల తన రామాయణావతారికలో శ్రీకంఠమల్లేశ్వరస్వామి వరప్రసాంతో కవిత్వం చెపుతున్నాను. అంతే తప్ప తనకు కవిత్వ సాధనకు ఉండవలసినవేమిటో

తెలియదన్నది.

" దేశీయపదములు దెను ఁ గులు సాంస్కృతుల్
సంధులు ప్రాజ్ఞుల శబ్దవితతి
శయ్యా రీతులు ఁ జాటు ప్రబంధంబు
లాయా సమాసంబు లర్థములును
భావార్థములు ఁ గావ్య పరిపాకములు రస
భావ చమత్కృతుల్ పలుకు సరవి
బహువర్ణములును విభక్తులు ధాతువుల
లంకృతి ఛందో విలక్షణములు ఁ
కావ్య సంపదక్రియలు నిఘంటువులును
గ్రమము లేవియు నెఱు ఁ గ విఖ్యాత గోప
వరపు శ్రీ కంఠమల్లేశు వరము చేత
నెఱి ఁ గి ఁ గవిత్వంబు జెప్ప ఁ గా నేర్చికొంటి "
(మొల్ల రామాయణం 1--12)

దైవాన్ని నమ్మని వాళ్ళు కూడా అంటే నాస్తికులు కూడా ఛందో బద్ధంగా పద్యాలు రాసిన వాళ్ళున్నారు. వాళ్ళు కూడా అనేక వందల పద్యాలను కంఠస్థం చేసిన వాళ్ళు అయి ఉంటారు. ఒక్కసారిగా ఎవరూ ఛందోబద్ధంగా పద్యాలను రాసేయ లేరు. ఈ సందర్భంగానే మనకి మరో అనుమానం రావచ్చు. వాల్మీకి శోకంలో శ్లోకం వచ్చింది కదా! అలా మనం కూడా దీర్ఘంగా దుఃఖిస్తే ఆ దుఃఖం నుండి కూడా కవిత్వం వస్తుందేమో అని!

వాల్మీకి బోయవాడుగా చేసిన కిరాతకాలు మాని, తపస్సు చేసిన తర్వాత శోకం నుండి శ్లోకం వచ్చింది. దాన్ని

శిష్యులు గమనించి ఆ శ్లోకం ఛందోబద్ధంగా ఉందని చెప్తుంటారు.

ఇక్కడ మనం ఒకటి మరిచిపోకూడదు. అప్పటికే వాల్మీకికి శిష్యులు ఉన్నారు. శిష్యులు ఏర్పడ్డారంటేనే "గురువు'గా ఆయన చాలా సాధించినట్లే లెక్క! అప్పటికే తపస్సు ద్వారా గొప్ప జ్ఞానాన్ని సాధించిన ఋషి.అందువల్ల అలాంటి మహర్షి మాట్లాడేది ఏదైనా ఒక క్రమ పద్ధతిలో అమరిపోవడం కూడా సహజమే! ఇది నేడు అవధానుల్లో కూడా గమనిస్తున్నాం కదా!

మనం ఆంధ్ర మహాభారతాన్ని పరిశీలిస్తే నన్నయ వాల్మీకి స్తుతిస్తూ ప్రచేత మహర్శి కుమారుడని సంబోధించాడు. అంటే అప్పటికే వాల్మీకి తండ్రి మహర్శి స్థానంలో ఉన్నాడన్నమాట!

మరి వాల్మీకి బోయవాడని చెప్పే కథల్లోని వాస్తవమెంత? ఇది చాలా పరిశోధనాంశం.

ప్రస్తుతం దాన్ని పక్కకు పెడదాం. కానీ, వాల్మీకి కవిత్వం రాయడానికి కవిత్వ ఆవేశానికి ఒక బోయవాడు మిధున పక్షులను కొట్టడం, ఆ జంట పక్షులలో ఒక పక్షి నేలరాలిపోయి విలవిలలాడడం, అది వాల్మీకి హృదయాన్ని కలచివేయడం, దానితో అతనిలో కవిత్వం ప్రారంభం కావడం అప్రయత్నంగా జరిగిపోయాయనేది అంత వాస్తవం కాకపోవచ్చు.

కవి కావ్యాన్ని ప్రారంభించడానికి కృత్యాద్యవస్థను పొందుతుంటాడు. కావ్యాన్ని ఎలా ప్రారంభించాలి?ఆ ప్రారంభం వల్లకావ్యానికి ఒనగూడే ప్రయోజనం ఏమిటని తర్కించుకుంటాడు. అప్పుడు కవిలో ఉండే విమర్శకుడు. కవికి

సహకరిస్తాడు. ఆ విమర్శకుడు బయటకు కనపడడు! అదే వాల్మీకి విషయంలోనూ జరిగింది. తాను రాయబోయే కథ పురాణ పురుషునికి చెందింది.

ప్రపంచానికి ఆదర్శప్రాయమైన పాత్రలను తీర్చిదిద్దాలనుకున్నాడు వాల్మీకి. అలాగే తన కావ్య నిర్మాణం కూడా తర్వాత కవులకు ఆదర్శం కావాలనుకున్నాడు. పటిష్టమైన నిర్మాణాన్ని తన మొదటి శ్లోకంలోనే పెట్టుకున్నాడు. వాల్మీకి తానొక పాత్రగా ఉంటూనే రామాయణాన్ని రాసి లోకానికి అందించాడు. కనుక, రామాయణాన్ని చాలా జాగ్రత్తగా రాశాడు.

ఈ చర్చ వల్ల మనం గమనించవలసిన అంశాలేమిటంటే కవిత్వం రాయడానికి ఆసక్తి ఉండాలి. దానిపైనే ఏకాగ్రత ప్రదర్శించి, తాను పొందిన కవిత్వానుభవాన్ని మాటల రూపంలోనో, రాత రూపంలోనో వ్యక్తీకరిస్తూనే, దాన్ని మళ్ళీ పరిశీలించుకోవాలి. శిల్పకారుడిలా తన కవిత్వ శిల్పాన్ని నిత్యం నగిషీలు పెట్టుకోవాలి. కవికి తన కవిత ఇంకా ఇలా రాస్తే ఇంకా బాగుండుననే ఆలోచన పుడుతుండాలి. కానీ ఒక సారి అది అక్షరరూపం పొందిన తర్వాత దాన్నే పట్టుకొని వేలాడకూడదు.

అనుకరణ ఒక సోపానం

"విన్నానమ్మా! విన్నా, నేన్నో విన్నాను!
నా విన్నవి కన్నవి విన్నవించగా
మాటలకై వెదుకాడగబోతే..
అవి,
పుంఖాను పుంఖంగా

శ్మశానాల వంటి నిఘంటువుల దాటి,
వ్యాకరణ సంకెళ్ళు విడిచి,
ఛందస్సుల సర్ప పరిష్వంగం వదిలి
వడిగా, వడివడిగా
వెలువడినై, పరుగిడినై, నా యెద నడుగిడినై...''

(శ్రీశ్రీ మహాప్రస్థానం, కవితా! ఓ కవితా!)

దీన్ని గమనిస్తే కేవలం ఛందోబద్ధంగనే కవిత్వం ఉండాలనేమీ లేదని తెలుస్తుంది.

మరి కవిత్వం రాయడానికి కావాల్సిందేమిటని ప్రశ్నించుకుంటే, మన లాక్షణికులు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం ప్రధానంగా ఉండాలన్నారు.

వీటిలో ముఖ్యమైందేమిటనే విషయంలో చాలా వాదోపవాదాలు జరిగాయి. మొత్తం మీద మూడూ ముఖ్యం అంటూనే అత్యంత ముఖ్యమైంది ప్రతిభ అన్నారు. కవిత్వం కోసం ఆరాట పడాలి. ఆరాటమంటే రాయాలనే ఆసక్తి. రాయడానికి ప్రయత్నించడం. రాయాలంటే ముందు బాగా చదవాలి. చదువుతుంటే మనమూ రాయాలనిపిస్తుంది.

ఇక్కడ మనం గుర్తించాల్సిందేమిటంటే ఏరచన చేయడానికైనా అభ్యాసం కూడా ముఖ్యమని మన సాహితీవేత్తలు అంగీకరించారని! అందువల్ల అభ్యాసం వల్ల కూడా ప్రతిభను సాధించేందుకు ప్రయత్నించి మంచి సృజన కారులు కావచ్చు.

అందువల్ల కవిత్వంలో కూడా అభ్యాసం కూసువిద్యగా ఉంటేనే చక్కని కవిత్వం రాయగలుగుతారు. మొత్తం మీద కవిత్వం రాయడానికి అభ్యాసం కావాలి అని అంగీకరించాం. కనుక, అభ్యాసం చేయడం ఎలా?

అనుకరిస్తూ పద్యం చెప్పొచ్చు.
అనుకరిస్తూ పాట పాడొచ్చు.
అనుకరణ లోనూ కవిత్వం పండించవచ్చు.
అనుకరణే కవిత్వం కాదు.
కవిత్వం అంతా అనుకరణ అయిపోదు.
అనుకరణలో కవిత్వం లేకుండా పోదు.

మన తెలుగు సాహిత్యంలో చాలా మంది కవుల పద్యాలను పరిశీలిస్తే ఒక కవిని మరో కవి అనుకరిస్తూ పద్యాలు చెప్పినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. నిజంగా అనుకరించే రాశాడా? ఆ కవిపై భక్తి, గౌరవాలతో అలా, అదే మార్గంలో, అవే పదాలను స్వీకరించి ఆ పద్యాలు రాశారా? అనేది మరో చర్చ. దాన్ని పక్కకు పెట్టి, అనుకరణతో మన పూర్వ కవులు కూడా పద్యాలు చెప్పారనేది ఒకటి రెండు ఉదాహరణలను బట్టి గమనిద్దాం!

తెలుగులో తొలి లిఖిత కావ్యం మహా భారతం. నన్నయ రాసిన "ఆంధ్రమహాభారతం" లో ఆణిముత్యం లాంటి పద్యం.....

"ధర్మ తత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని
యాధ్యాత్మ విధులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని
కవి వృషభులు మహా కావ్యమనియు
లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని
యైతి హాసికు లితిహాసమనియు
పరమ పౌరాణికుల్ బహు పురాణ సముచ్చ
యంబని మహిఁగొనియాడు చుండ

వివిధ వేదతత్త్వవేది వేద వ్యాసు
డాది ముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరుగుచుండ జేసే భారతంబు.

(నన్నయ ఆంధ్రమహాభారతం 1 31)

ఈ పద్యం మహాభారతం యొక్క గొప్పతనాన్ని వేనోళ్ళా చాటుతోంది. ఈ పద్యాన్ని అనుకరిస్తూ పాల్కురికి సోమనాథుడు "చతుర్వేదసారము" కావ్యం గొప్పతనాన్ని ఇలా వర్ణించాడు.

"వైదికులిది శుద్ధ వైదికంబనియెన్న
శాస్త్రజ్ఞులిది ధర్మ శాస్త్రమనగ
తార్కికులిది మహా తర్కంబనంగ పౌ
రాణికులిదేయె పురాణమనగ
ఆగమ విదులు దివ్యాగమం బిదియన
తంత్రజ్ఞులిది వీర తంత్ర మనగ
భక్త వారంబిది. భక్తి మార్గంబన
ముక్త్యర్థులిది మహా ముక్తి దమన
కవులు భువిని నిదేయె కావ్యం బనంగను
సజ్జనులకు మిగుల సంతసముగ
నిర్వి కల్పరతి చతుర్వేద సారమున్
పద్యముల్ రచింతు బసవలింగ!"

(పాల్కురికి సోమనాథుడు చతుర్వేదసారం: 22వ పద్యం)

ఈ రెండు పద్యాలను చూస్తే ఆంధ్ర మహా భారతంలోని పద్యాన్ని అనుకరిస్తూనే పాల్కురికి సోమనాథుడు పద్యాన్ని వర్ణించాడని స్పష్టమవుతుంది.

పాల్కురికి సోమనాథుడు, నన్నయ పద్యాన్నే అనుకరించడానికి కారణం, తాను కవిత్వాన్ని "అభ్యాసం" చేయాలని కాదు. వైదికమత ప్రాచుర్యానికి మహా భారతం తోడ్పడినట్లే, శైవ మతాభివృద్ధికి "చతుర్వేదసారం" తోడ్పడాలంటే, దాని గొప్పతనాన్ని వివరించే గొప్ప పద్యంలో దాన్ని వర్ణించాలి. నిజానికి పాల్కురికి సోమనాథుడు ప్రతిభావంతుడైన కవి. అయినప్పటికీ ఆ పద్యాన్నే అనుకరించటంలో ఆయనకు గొప్ప తెలివి తేటలున్నాయి. ఒక గొప్ప ప్రచారవ్యూహం ఉంది.

అప్పటికే ఆ పద్యం ప్రజల నోళ్ళలో బాగా నాని ఉండొచ్చు. ప్రాచుర్యంలో ఉన్న పాటని ఉద్యమాలకి, చివరికి మత ప్రచారానికి వాడుకోవడాన్ని నేటికీ చూస్తూనే ఉన్నాం. "శైవ మతం" ప్రాచుర్యంలోకి రావాలని శైవ కవులు ఆశించారు.

అందువల్లనే ప్రజల భాషను తమ పద్యాల్లో విరివిగా ఉపయోగించుకున్నారు. దానికి అవసరమైతే వ్యాకరణ దోషాలను కూడా లెక్క చేయలేదు. అలాగే, ప్రాచుర్యం పొందడానికి అనుకరణ ద్వారా నైనా ఆ పద్యం తరహాలోనే చతుర్వేదసారములోని పద్యాన్ని వర్ణించి ఉండవచ్చు. అంతే తప్ప తన కవిత్వాన్ని అభ్యసించడానికి కాదని గమనించాలి. కానీ, ఇక్కడ మన చర్చ ఏమిటంటే, ప్రసిద్ధకవులు కూడా అనుకరించారని గుర్తించడమే. అనుకరణ ఒక లోపంగా భావించనవసరం లేదు.

శ్రీమద్భాగవతంలో పోతన పద్యాలు చాలా మందికి సులభంగా కంఠస్థం చేయడానికి అనువుగా ఉంటాయి. పద్యాలు కూడా మధురంగా ఉంటాయి.శ్రీ కృష్ణుణ్ణి వర్ణిస్తూ చెప్పిన ఒక

పద్యం...

"నల్లని వాడు, పద్మ నయనంబుల వాడు, కృపారసంబుపై
జల్లెడు వాడు, మౌళి పరిసర్పిత పింఛము వాడు, నవ్వురా
జల్లెడు మోము వాడొకడు చెల్వల మాన ధనంబు దెచ్చెనో
మల్లియ లార! మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే"

(పోతన. శ్రీ మద్భాగవతము 9 60)

ఈ పద్యాన్ని అనుకరిస్తూ దాశరథి ఒక పద్యం రాశారు. మిసిసిపి విశ్వ విద్యాలయంలో నీగ్రో జాతీయుడు జేమ్స్ మెండిత్ తొలిసారిగా పట్టభద్రుడయ్యాడని తెలిసి దాశరథి రాసిన (దాశరథి కవిత నీలిరవ్వ. 1977: 436) పద్యం అద్భుతంగా ఉంది.

"నల్లని వాడ, జ్ఞాన నయనమ్ముల వాడ! మనస్సు లోపలన్
తెల్లని వాడ, హింసను వధించిన నల్లని వాడ! శాంతిపై
జల్లిన వాడ, తెల్లని విషమ్మునకు విరుగైన వాడ! నా
ఉల్లము లోనివాడ! పదవోయి విశాల విభా పథాలపై"

దాశరథి (దాశరథి కవిత 1977: 436)

ఇలాంటి పద్యాలన్నీ గమనిస్తే ఇవన్నీ అనుకరిస్తూ చెప్పినవని స్పష్టంగానే తెలుస్తుంది. అయితే, కవిత్వం నేర్చుకోవడానికే ఇవి రాశారని అనుకోవడానికి వీల్లేదు. కానీ, పద్యాలు రాసే వాళ్ళు ఇలాంటి వాటిని గమనిస్తే పద్యాలు రాయడానికి కొన్ని సులువులు తెలుస్తుంటాయి.

ఇటువంటి కవితా రచనకు సంబంధించి మన లాక్షణికులు చర్చ చేశారు. కొన్ని సార్లు ఒకే వస్తువుని అనేక మంది కవులు రాసే అవకాశం ఉంది.శిల్పపరంగా వాటిలో భేదాలు కనిపిస్తాయి. తాము రాయగలిగి కూడా కొంతమంది

అనుకరణతో పద్యరచన చేస్తుంటారు. దీన్ని రామరాజ భూషణుని కావ్యాలంకార సంగ్రహానికి వ్యాఖ్యానం రాసిన సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి ఇలా వివరిస్తున్నారు.

(చూడు : కావ్యాలంకార సంగ్రహం, 1976: 123 - 125)

కవుల ప్రతిభ కొన్ని సార్లు కొన్ని పోలికల రూపంలో కనిపిస్తుంది. వాటిని ప్రతిబింబాకార సంవాదం, ఆలేఖ్యాకార సంవాదం, దేహాంతరతుల్య సంవాదం గా పేర్కొనవచ్చునని అన్నారు.

బింబానికి ప్రతిబింబం సిద్ధం చేసినట్లుగా పద్యాన్ని మక్కీకి మక్కీ పెట్టేసుకోవడం బింబాకార సంవాదం అంటారు.

ఒక చిత్రాన్ని పోలిన చిత్రం చిత్రించినట్లుగానే ఒక కావ్య వస్తువుని మరొకరు రాసిన కావ్యవస్తువు కూడా పోలి ఉండడం ఆలేఖ్యాకార సంవాదం అంటారు.

భావంలో గానీ, సందర్భంలో గానీ, వస్తువులో గానీ పోలికలు ఉండి, స్వతంత్రత కోల్పోకుండా సహజ సుందరంగా ఆస్వాదయోగ్యమైతే దాన్ని దేహాంతర తుల్య సంవాదం అని అంటారు. ఉదాహరణకు కాళిదాసు రాసిన " మేఘ సందేశము " ను అనుసరించి చాలా మంది సందేశ కావ్యాలను రాశారు. అయినంత మాత్రం చేత అవి అనుకరణలని అనడానికి వీల్లేదు. ఆ పద్ధతిలో కావ్యాన్ని రాశారని భావించాలి. ఇది మనిషిని పోలిన మనిషి స్వతంత్ర ఆత్మ శక్తిని కలిగి ఉన్నట్లన్నమాట.

వీటిలో ఏది రాయాలన్నా కవికి ప్రతిభ ఉండాలి.

ఛందోబద్ధంగా పద్యాలు రాయడానికి భాషపై పట్టుతోపాటు, వ్యాకరణం, ఛందస్సు, అలంకారాలు మొదలైన కవితా సామాగ్రిని బాగా అవగాహన చేసుకోవాలి.

తేటగీతి, ఆటవెలది పద్యాలను అనుకరిస్తూ క్రమేపీ వృత్త పద్యాలను రాసే స్థితికి చేరుకోగలుగుతారు. కొంత మంది పద్యాలను రాస్తూనే, తమకి ఎలాంటి పాండిత్యం తెలియదని అంటుంటారు. పద్యాల్లో ఛందస్సు ఉంటుందని కూడా తెలియదని ఒక లయని అనుసరించి పద్యాలు చెప్తున్నాననీ అనేవాళ్ళూ ఉన్నారు. కవయిత్రి మొల్ల అలాగే చెప్పింది. అలంకార శాస్త్ర విషయాలేవీ నాకు తెలియదంటూనే ఆ విషయాలన్నీ ప్రస్తావించింది!

వాటిని ఎంత వరకూ నమ్మాలి? నమ్మ కూడదు? అనే అంశాల్ని పక్కకు పెట్టి, పాండిత్యానికి సంబంధించిన అంశాల్ని సాధన చేయడం పద్య రచనకు అవసరమని గుర్తించాలి.

మరి కొంత మంది సంగీతంలోని స్వరాలను గుర్తుపెట్టుకొనిరాగాన్ని ఆధారంగా పద్యాలను చెప్తున్నామని అంటుంటారు. అవధానులు సర్వసాధారణంగా రాగం తీస్తూ పద్యం చెప్తుంటారు.

కొంత మంది వినయంగా దైవమే తమతో కవిత్వం చెప్పించినట్లు చెప్పుకున్నారు. అలాంటి వాళ్ళలో మొల్ల అనే కవయిత్రి ఒకరు.

" చెప్పుమని రామచంద్రుఁడు
సెప్పించిన పలుకుమీఁదఁజెప్పెద నేనె
ల్లప్పుడు నిహపరసాధన
మిప్పుణ్యచరిత్ర తప్పులెంచకుఁడు కవుల్ "

(మొల్లరామాయణం 1 - 13)

ఇలా చెప్పుకున్నా, కవిత్వంలో ఏమేమి ఉండాలో ఏమేమి ఉండకూడదో కూడా చెప్పింది. అంటే ఛందోవ్యాకరణాది

శాస్త్రాలను చదువుకొని కూడా తప్పులేమైనా దొర్లే అవకాశం ఉంటే అది భావావేశంలో దైవప్రేరణకే ప్రాధాన్యాన్నిచ్చానని సమర్థించుకోవడానికి అది ఉపయోగపడొచ్చేమో!

ఏది ఏమైనా ఒక క్రమపద్ధతిలో అభ్యాసం చేయడం పద్యరచనకు అవసరం. గురువు గారి పర్యవేక్షణ ఉంటే అది మరింత వేగవంతంగా అలవడుతుంది.

తెలుగు కవిత్వంలో 1930 తర్వాత బహిరాకృతిలో వచ్చిన మార్పు వచన కవిత్వం. అంతకు ముందు సింహగిరి నరహరి 'వచనాలు' ఉన్నా, అలాగే తాళ్ళపాక వారి 'విన్నపాలు' వంటివి వచనరూపంలో కనిపించేవే. అయితే వాటికంటే భిన్నంగా వచనకవిత్వం రాస్తామంటూ కవులు కలం పట్టారు. అప్పటి నుండీ వచన కవిత్వం ప్రాచుర్యంలోకి వచ్చింది.

ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య, ఆచార్య చేకూరి రామారావు గార్లు ఈ వచన కవిత్వానికి లక్షణాలను వివరించే ప్రయత్నాలు చేశారు. కొంతమంది పాద విభజన, మరికొంత మంది లయా ప్రధానమన్నారు. లోతుగా చూస్తే వచన కవిత్వానికి ఆ రెండింటి కంటే కవిత్వం ముఖ్యం. దాన్ని ఎన్ని పాదాల్లో చెప్పామనే దానికంటే ఎంత శక్తివంతంగా ఆ భావాంశాల్ని అందించగలుగుతున్నామనేదే ప్రధానం. దాన్ని రకరకాలుగా విభజించుకోవచ్చు. విభజించినట్లే కవితను చదవడం లేదుకదా. కవిత్వాంశాన్ని పట్టిచ్చే భావాంశం బలంగా ప్రతిపాదంచడమే వచన కవిత్వం ప్రధాన లక్షణం.

ఏం రాయాలి? ఎలా రాయాలి?

అది తెలిస్తే నేనూ పెద్ద రచయితనైపోయిండేవాణ్ణి కదా! అనుకొంటున్నారా? పెద్ద రచయితలు కూడా కొన్నాళ్ళు రాయడం ఆపేస్తే, ఏం రాయాలి? ఎలా రాయాలనే ప్రశ్న

వాళ్ళకీ తలెత్తక తప్పదు! కొత్తగా రాస్తున్నట్లే ఉంటుంది. అలాంటప్పుడు రచనలు చేయాలనే కొత్త వాళ్ళ పరిస్థితి ఇంకెలా ఉంటుందో ఊహించండి. మీకీ సందర్భంగా ఓ విషయం చెప్పడానికి ప్రయత్నిస్తాను.

అబ్బ! అసలు విషయం మరిచిపోయి, ఏమిటీ సంఘటనలూవివరణలూ అన్పిస్తుందా! పేజీ తిప్పేయాలని చేయి తొందరపెడుతుందా!

ఔనుకదూ..... ఒక్క నిమిషం......!

అదేమిటో గాని మన స్వభావం చాలా చిత్ర విచిత్రంగా ఉంటుంది. ఆకర్షణీయమైన వాటిపట్లే మనసు కేంద్రీకరించాలని అనిపిస్తుంది. టీ.వీ.చానల్‌లో మనకేదైన ప్రోగ్రామ్ కొంచెం నచ్చక పోయినా, ఒకోసారి నచ్చినా సరే చేతిలో రిమోట్ కంట్రోల్‌ని అప్రయత్నంగా మనవేలు నొక్కేస్తుంటుంది.

ఎవ్వరైనా మాట్లాడుతున్నప్పుడైనా సరే...... వాళ్ళ మాటల్లో స్పష్టత లేకపోయినా, ఆకర్షణీయంగానో, అర్థవంతంగానో లేకపోయినా, వాళ్ళ మేనరిజమ్ నచ్చక పోయినా, వాళ్ళ మాటల్ని వినాలనిపించదు.

వినాలనిపించాలంటే కావల్సిన వేమిటో కొన్నింటిని పైనే చెప్పుకున్నాం! రాసింది చదవాలంటే ఎలా రాయాలనేదే నేను చెప్పబోయేది! ఆ! ఇంతకీ ఇందాక ఓ విషయం చెప్పాలన్నాను కదూ!

అదేమిటంటే,

మీరెప్పుడైనా, ఎవరికైనా ఉత్తరం రాశారా?

"రాయకపోవడం ఏంటి? ఇప్పుడంటే, ఏదో ఫోన్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలొచ్చి ఉత్తరాలు రాయడం

తగ్గిపోయిందిగానీ, అయినా, అప్పుడప్పుడూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బంధువులకు తప్పడం లేదు కదా!'' అనే నా మీ సమాధానం. సరే, ఉత్తరాలు రాసే మంచి అలవాటు వదులుకోనందుకు మిమ్మల్ని అభినందించకుండా ఎవ్వరూ ఉండలేరనుకోండి!

కానీ, మీరు మొట్టమొదటిసారి ఉత్తరం రాసినప్పుడు, ప్రత్యక్షంగా చెప్పాలనుకున్న విషయాల్ని ఉత్తరం మీద రాశారా? ఏదైనా కాగితం మీద ముందుగా రాసుకొని, తర్వాత వాటిలో దోషాల్ని సరిదిద్దుకొని, మళ్ళీ ఉత్తరం మీద రాసిన జ్ఞాపకాలేమైనా మీ మనసు పొరల్లో దాగి ఉన్నాయేమో గుర్తు చేసుకోండి.

"అదేమీలేదు, ఉత్తరం మీదే రాశాను ఒక్క కొట్టివేతైనా లేకుండా!'' అని గుండెల మీద చెయ్యేసుకొని చెప్పగలరా?

బుడి బుడి అడుగుల బుల్లి చప్పుళ్ళు లేకుండానే, నడకొచ్చేసినట్లు, భాషవచ్చి, రాయడం నేర్చుకొన్నప్పుడే ఒక్క కొట్టివేత గానీ, దోషం గానీ లేకుండా తొలిసారే మంచి ఉత్తరం రాసేస్తే, రాసే మంచి నైపుణ్యం ఉన్నట్లే లెక్క!

"ఉత్తరం రాయగలిగితే బాగా రాయగలిగినట్లేమిటి'' అనిపిస్తుందా?

చలం, గుంటూరు శేషేంద్ర శర్మ వంటి సాహితీ వేత్తలు ఎంతో మంది ఉత్తరాల్లోనే అందరికీ అర్థమయ్యే భాషలో, ఆకర్షణీయమైన శైలిలి, అర్థవంతంగా ఎన్నో సాహిత్య విషయాల్ని రాశారు!

ఉత్తరాలకే ఇంత జాగ్రత్త తీసుకొంటే, మనసుని రంజింపజేస్తూ, సందేహాల్లేకుండా, సందేశాన్ని అందిస్తూ,

సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సాహిత్య ప్రక్రియల్లో మన భావాల్ని ప్రవహింప జేయాలంటే ఇంకెంత శ్రద్ధ తీసుకోవాలో అర్థం కావడం లేదా?

రాసే అలవాటు ఉంటే, కొట్టివేతల నుండీ, కాగితాలు, కాగితాలు చింపేసే పరిస్థితి నుండీ క్రమేపీ తప్పించుకోవచ్చు. అది రాసే వాళ్ళు కొత్తవాళ్ళైనా, పాత వాళ్ళైనా!

అంత మాత్రం చేత రాయడం కష్టమనకోవడమేనా?

మనం చాలాచోట్ల చూస్తుంటాం.

ఏదైనా దరఖాస్తో, ఫిర్యాదో రాయడానికి కూడా చాలా కాగితాలు, కాగితాలు ఖరాబు చేస్తుండడాన్ని! ఇంకరాయలేమని దాన్ని వదిలేస్తారా? మళ్ళీ ప్రయత్నిస్తారు. విజయపథం వైపు పయనిస్తారు. అలా కాకుండా, దాన్నే ఇంకొకరి చేత రాయిస్తే, రాయడాని కంటే, రాయించుకోవడానికే అలవాటు పడిపోతుంటారు.

మనకి రాని భాషలో రాయలేక పోయినా, వచ్చిన భాషలో నాలుగు మాటలైనా రాయలేక పోతే నిజంగా అదెంత దురదృష్టం?

మనసులో భావాలు సంఘర్షించుకోవాల్సిందేనా?

మాట్లాడలేని వాళ్ళకి మాటలొస్తే, కళ్ళు లేని వాళ్ళకి చూపొస్తే, కాళ్ళు లేని వాళ్ళకి నడకొస్తే ఎంత సంతోషం!

ఆ ఆనందం అందుకోవాలంటే, మనసులో తీయగా మూలుగుతున్న భావాలు బయటకు తియ్యగలిగితే అప్పుడు పొందే తన్మయత్వం అనిర్వచనీయం కదా!

ఇదెలా సాధ్యం! మనం నిత్యం చాలామందిని కలుస్తుంటాం! కొంత మందితో మాట్లాడుతుంటాం. కొంత

మందిని కళ్ళతోనే పలకరిస్తుంటాం! మరి కొంత మందిని చేతి సైగలతోనే పలకరిస్తుంటాం!

వీటిలోనూ భాషా ప్రసారం ఉంది. భావాల వినమయం ఉంది. ఒకరినొకర్ని అర్థం చేసుకోవడం ఉంది.

ఇప్పుడు మనం ఎవరైనా మాట్లాడుకొనే దగ్గర మౌనంగా కూర్చుందాం! పోని వాళ్ళూ మౌనంగానే కూర్చొన్నా పర్వాలేదు. మనం కూడా ఆ గుంపులో మౌనంగానే కూర్చుందాం! మౌనం కాలం కదలడం లేదు. ఎంతో సేపు ఒకరినొకరు చూసుకొంటారు. ఎంతసేపు దిక్కులు చూస్తారు. ప్రకృతినెంత సేపు పరిశీలిస్తారు!

మీకు తెలియకుండానే మీ మనసులోని భావం ఏదొక మాటగా, ఏదో సందర్భంలో బయటకొచ్చేస్తుంది.

పోనీ మీతో కూర్చొన్న వాళ్ళలో నుండైనా! మాటలు సంభాషణలవుతాయి.

సంభాషణలు కొనసాగి కొనసాగి, ఒక్కొక్కరి జీవితాల్ని కొత్త కోణాల్లో ఆవిష్కరించడానికి ప్రయత్నాలు జరుగుతాయి. కాలం ఖచ్చితంగా మీ పాదాక్రాంతమయ్యింది! ఆ విషయమే మీరు మరిచిపోవచ్చు. అరే, ఇంత టైమైపోయిందా అనీ అన్పించవచ్చు.

ఇక, అసలు సంగతికొస్తాను.

మీరు, మీతో పాటు మాట్లాడినవాళ్ళు ఏమి మాట్లాడారు. ఎవరి గురించి మాట్లాడారు ఏ మాటలు వినాలనిపించింది. ఏవి వినాలనిపించలేదు. ఆ విషయాలు తెలీదు కానీ, ఎందుకో కొంతమంది మాటలు చాలా సేపు వినాలనిపించింది కదూ!

అప్పుడు జరిగిన సంభాషణల్లో మనకి నచ్చిన వ్యక్తి

గురించి కొంతమంది లేదా ఎవరో ఒకరు చాలా మంచిగా చెప్ప ఉండొచ్చు. నచ్చిన వ్యక్తి గురించి చెప్పిన ఏవో కొన్ని మాటలు మనకి నచ్చి ఉండొచ్చు. ఆ మాటల్లో కొన్ని "గాసిప్స్' ఉన్నాయి. అయినా, ఆ మాటలు మన మనసుకి ఆనందాన్ని కల్గించాయి ఆకర్షించాయి.

ఆకర్షణలో ఆనందం ఉండొచ్చు గానీ. వాస్తవం ఉందా? ఆ మాటలు మనమీద కల్గించిన భావాలేమిటి? దాని ప్రభావం మన ప్రవర్తనలో ఎలా రూపొందింది!

వీటిని గమనించగలరా? నలుగురు కల్సినప్పుడు, తనకు నచ్చిన వ్యక్తిని, తన కోణంతో, మిగిలిన వాళ్ళకి పరిచయం చేస్తున్న భావన కలగకుండానే పరిచయాన్ని రుద్దేస్తుంటారు ఆ వ్యక్తిపట్ల గౌరవాన్నీ, ఇష్టాన్నీ కల్గించవచ్చు. లేదా, ఆ వ్యక్తి పట్ల అయిష్టాన్ని, అగౌరవాన్ని కల్గించి, ఆ వ్యక్తి వ్యక్తిత్వం అసలు మంచిది కాదనే అభిప్రాయాన్ని కల్గించవచ్చు.

దానితో ఆ వ్యక్తి పట్ల "ఒక విధమైన అభిప్రాయం" మన ఆలోచనలో రికార్డ్ అయిపోతుంది. ఆ వ్యక్తి ప్రతి కదలికా, ప్రతి మాటా, మనకి రూఢి అయిపోయిన అభిప్రాయంగానే కన్పిస్తుంది.

పచ్చ కామెర్లు వచ్చిన వాళ్ళకి లోకమంతా పచ్చగా కన్పిస్తుందనే సామెతలాగా!

ఇలా వాస్తవాలకంటే, అవాస్తవాల్ని ఆకర్షణీయంగా ప్రచారం చేయడంలో గాసిప్స్ ఉంటాయి. ముఖాముఖీ ఆ వ్యక్తితో మనం మాట్లాడలేనంతవరకూ మనకేర్పడిన అభిప్రాయాలు రోజురోజుకీ బలపడి పోతుంటాయి. గుడ్డిగా అనుసరించే గుణాన్ని నేర్పుతుంటాయి.

మనసు చీకటి మీద వివేకమనే వెలుతుర్ని ప్రసరింప జేసి, నిజం తెలుసుకోవడానికి ప్రయత్నించనంతవరకూ, అదొక "అగాధంగా" మారి "అశాంతిగానో", అవాస్తవం తెచ్చిన భ్రమాజనిత ఆనందం లోనే విహరించేటట్లు జీవితాన్ని మార్చేస్తాయి.

గాసిప్స్‌లో వాస్తవాలకంటే, ఉబుసుపోక చెప్పుకొనే పోసుకోలు కబుర్లే ఎక్కువగా ఉంటాయి. ఎదుటి వ్యక్తి పట్ల అసూయ, ఈర్ష్య, ద్వేషాలు, ఓర్వలేనితనం ఉంటాయి. ఆ వ్యక్తిలో వికసించే ప్రతిభా పరిమళాల్ని తట్టుకోలేక, సుగుణాల్ని సహించలేక, ఆవేదన, అసూయగా మారి దుర్గుణాలుగా ప్రచారం చేస్తుంటారు.

ఆ వక్తి వ్యక్తిత్వాన్ని నాశనం చేయాలని ఆకాంక్షిస్తూ, తమ ప్రణాళిక విజయవంతమవుతున్న కొద్దీ, తాత్కాలిక ఆనందాన్ని పొందుతుంటారు. "గాసిప్స్' ప్రచారం చేసేవాళ్ళు! ఒంటరిగా తన మనసులోతుల్లోకెళ్ళి చూసుకొన్నప్పుడు మాత్రం అభద్రతతో, అపరాధ భావంతో, ఎవరికీ చెప్పుకోలేక ఆత్మవంచన చేసుకొంటూ ఆవేదనతో రగిలిపోతుంటారు!

అబద్దాల్ని ప్రచారం చేసిన వ్యక్తి గురించే ఆలోచించాం కదూ! మరి, ఆ గాసిప్స్‌ని విని, వాటిని నిర్ధారణ చేసుకోకుండా, అంటే, ముఖాముఖి తెలుసుకోకుండా నమ్మేసేవాళ్ళు, చాలా కోల్పోతారు. అది వెంటనే తెలియదు.

మొదట్లో గాసిప్స్ ప్రచారం చేసేవాళ్ళు, వినే వాళ్ళను ఆకర్షించుకోవడానికి, వాళ్ళ బాగోగులు పట్టించుకొన్నట్లు ఏవో కొన్ని షుగర్ కోటేడ్ టాబ్లెట్స్‌లా కొన్ని మంచి విషయాల్ని

చేరుస్తుంటారు. దానితో తమ పనుల్ని కూడా వదిలేసి, వచ్చిన వాళ్ళతో పిచ్చాపాటి కబుర్లు చెప్పడానికి తయారై, తమ చుట్టూ కూర్చోబెట్టుకుంటుంటారు.

తాను చేసే గొప్ప పనుల్ని చెబుతున్నట్లు తెలియకుండా జాగ్రత్తపడుతూనే, తెలియ జేస్తూ, ఆహా! "మన అభివృద్ధిని ఎంతగా ఆకాంక్షిస్తున్నారో" అనికొనే స్పృహా కల్గిస్తారు.

మతం మత్తు మందు వంటిదన్నారు గానీ కారల్ మార్క్స్, అంతకంటే, గాసిప్స్ మరింత మత్తును కల్గిస్తాయి. "గాసిప్స్' చెప్పే వ్యక్తి చుట్టూ కొంతకాలం మనల్ని తిరిగేటట్లు చేస్తాయి. వాస్తవాలు తెలిసేకొద్దీ తాము కోల్పోయిన మానవ సంబంధాల్ని, అవాస్తవాల్ని ప్రియం చేసుకోవడం వల్ల అప్రియమైపోతున్న జీవితాన్ని తలచుకొని, తమకి తెలియకుండానే "పోతున్న కలివిడితనాన్నీ', వస్తున్న ఒంటరితనాన్ని భరించలేక, మానసిక సంఘర్షణకు గురవుతుంటారు. వీటిని సాధ్యమైనంత త్వరగా గుర్తించకపోతే అది మనోవైకల్యానికి దారి తీసే ప్రమాదం లేకపోలేదు.

ఔను... దీని నుండి రాయడమెలా అనేదేమి తెలుసుకున్నామనే సందేహం రావచ్చుకదా?

మన సంభాషణల్ని, యధాతథంగాకాకపోయినా, ఇంచుమించుగానైనా వాటిని ఇంటికొచ్చి ఎప్పటికప్పుడు రాసుకొంటూ పోతే, కొన్నాళ్ళ తర్వాత వాటిని చదువుకొంటే వ్యక్తిత్వాన్ని పట్టిచ్చే ఒక చక్కని వ్యాసాన్ని రాయవచ్చు.

ప్రతిదానిలోనూ పరిశీలన ఉంటుంది. కాదేదీ కవిత కనర్హం అన్నాడు గానీ శ్రీశ్రీ, రాయగలిగితే రచనకేదీ అనర్హం కాదు! అది చెప్పడానికే రాయడమెలాగో తెలియడానికే వీటిని

రాసింది. ఏం రాసినా, ఎలా రాసినా జీవితంలోని ఏదొక కోణాన్ని అందిస్తూ ఆనందాన్ని అందిస్తూనే, జీవితాన్ని వివేకవంతం చేయగలగాలి!

ప్రపంచం నిత్యం మారిపోతుంది. ఎప్పుడూ ఒకే రకమైన ఆలోచన ఉండదు. ఆలోచనలు మారుతుంటాయి. ప్రజలు నూతనత్వాన్ని కోరుకుంటుంటారు. కవిత్వం, కథలు, నాటికలు, నాటకాలు వంటివి మాత్రమే కాదు. ఆకర్షణీయంగా, అర్థవంతంగా చెప్పగలిగితే ఏ ప్రక్రియలో నైనా మన భావాల్ని చెప్పవచ్చు. సందేశాన్ని అందించవచ్చు.

పత్రికలు, ప్రసార సాధనాలు ఫ్రీలాన్స్ జర్నలిజానికి ఎంతో అవకాశాన్ని కల్గిస్తున్నాయి.

సృజనాత్మ రచనలు చేయాలనుకొనే వాళ్ళు ఒకేసారి పెద్ద కావ్యమో, మహానాటకమో రాసేయాలనే అత్యాశకు గురికాకూడదు. పత్రికలో జోక్స్, చిన్న చిన్న ఫోటో కామెంట్స్, మినీ కవితలు, కార్డు కథలు, సింగిల్ పేజి కథలు రాస్తుండాలి. దీనితో పాటు తాము చదివిన కథలు, కవితలు, వ్యాసాలు, పత్రికల్లో ప్రచురించిన చిత్రాల్ని చూస్తున్నప్పుడు కలిగిన స్పందనల్ని ఉత్తరం/ మెయిల్ రూపంలో రాస్తుండాలి. నిజానికి ప్రతి రచయితా ఉత్తరాల రచయితగానే ప్రారంభవడం సర్వసాధారణంగా జరుగుతుంటుంది.

ఒక వేళ పద్య కవిత్వమే రాయాలనుకుంటే కూడా కొన్ని పత్రికలు సమస్యా పూరణ పేరుతో కొన్ని శీర్షికలను నిర్వహిస్తున్నాయి. వాటిలో పాల్గొవడం వల్ల కూడా పద్య రచనా విద్య పట్ల ఆసక్తి పెరిగి, పద్య రచనలో గల మెలకువలు తెలుస్తుంటాయి.

ఇలా చిన్న చిన్న ఉత్తరాలతో ప్రారంభమైన వాళ్ళు ఇప్పుడు అన్ని పత్రికల్లోనూ ప్రముఖ రచయితలుగా చెలామణి అవుతున్నారు. చాలా మంది తమ పేరుని పత్రికల్లో చూసుకోవడానికే ఉత్తరం రాస్తుంటారు. అది అచ్చయ్యిందా ? లేదా? అని రోజూ ఆ పత్రిక చూస్తుంటారు. దాని వల్ల రెగ్యులర్‌గా చదివే అలవాటు వస్తుంది. రెగ్యులర్ గా లైబ్రరీకి వెళ్ళే అవలవాటూ ఏర్పడుతుంది. సృజనాత్మక రచనలు చేయడానికి ఇవే సగం భూమికను సిద్ధం చేసేస్తాయి. మనకి తెలియకుండానే మనం రచనా రంగంలో ఒక భాగమై పోతుంటాం. ఆ సమయానికి పత్రిక చూడకపోయినా. చదవకపోయినా, తన అనుభూతిని రాయకపోయినా ఉండలేని స్థితికి చేరుకుంటాం.

రచనను రాసిన తర్వాత కూడా సృజనకారుడులో భావావేశం కొన్ని రోజుల వరకూ కొనసాగుతూనే ఉంటుంది. అది రెండు రకాలుగా ఉంటుంది.

రచనలో ఇంకా చేర్చవలసినవి ఉన్నాయని లేదా కొన్ని మార్పులు చేసి ఉంటే బాగుండేదని భావిస్తుంటాడు. నిజానికి ఏ రచనా సర్వసమగ్రం కాదు. సృజనకారుని మదిలో రూపొందిన భావాలను అలా ఆవిష్కరించే ప్రయత్నంలో, తాను అనుకున్న లేదా అనుకోని దానికంటే కూడా మెరుగైన రచనను రూపొందించగలిగే అవకాశం కూడా ఉంది. ఇది రచన రూపొందడానికి సంబంధించింది.

రెండవది రచన కలిగించే ప్రభావానికి సంబంధించింది. రచనను పాఠకులు ఎలా స్వీకరిస్తారో! తన రచనను రాసిందాన్ని రాసినట్లుగా ప్రచురిస్తారో లేదో! ఒక వేళ ఎడిట్ చేస్తే ఎక్కడ.

ఎలా చేస్తారో! ఎడిటింగ్ లో జరిగే పొరపాట్ల వల్ల తన రచనల వట్ల పాఠకులకు ఎలాంటి అభిప్రాయం ఏర్పడుతుందో! ఇలా రచనానంతరం జరిగే రచయిత మానసిక సంఘర్షణ బయటకు కనిపించదు.

అందుకే రచయితలు చాలా వరకూ ఏకాంతాన్ని ప్రేమిస్తుంటారు.

ఏకాంతాన్ని కోరుకుంటుంటారు. ఏకాంతంగా ఉన్నట్లు కనిపిస్తారు. నిజానికి వాళ్ళు ఏకాంతంగా ఉండలేరు. ఆలోచనల సంఘర్షణలో నిమగ్నమవుతుంటారు.

అది వియోగం కాదు. భావాల రూపకల్పన సాధన. అందుకే రచయితలు అందరిలో ఉన్నా ఒంటివాళ్ళు. ఒంటరిగా ఉన్నా అందరి వాళ్ళు. ఈ స్థితి సృజనకారుల్లో కనిపిస్తుంది. దీన్ని మానసిక రోగం అని కూడా అనొచ్చు. మరి కొంత మంది దీన్ని వ్యసనం అన్నారు. కవిత్వం రాయడం, చదవడం సప్తవ్యసనాల్లో ఒకటి అన్నారు. అందువల్ల రచన చదవడం, రాయడం ఒక వ్యసనంగా మార్చుకోవాలి. అప్పుడే మనం సృజనాత్మక రచనలను చేయగలుగుతాం.

ప్రయత్న పూర్వకంగా గాని, అప్రయత్న పూర్వకంగా గాని స్పందించడం ద్వారా నూతన ఆలోచనలతో లేదా నూతన భావనలతో హృదయంలో రగిలిన ఒక క్రియాశీలత్వ విధానం సృజనాత్మకతలో ఉంటుంది. సృజనలో మేధోగతంగా గానీ, హృదయస్పందన వల్ల గానీ పుట్టుకొచ్చే కొత్త కొత్త ఆలోచనల పరంపర, క్రియాశీలత ఉంటుంది.

విద్యార్థుల రచనల విశ్లేషణ

ఈ సందర్భంగా ఒక కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు రాసిన రచనలను విశ్లేషించి చూపిస్తాను. ఇక్కడ నేను కింది పేర్కొంటున్న విషయాలన్నీ శ్రీ అనంత పద్మనాభ కళాశాల.

వికారాబాదు వారు ప్రచురించిన వార్షిక సంచికలో రాసిన సమీక్షావ్యాసం లోనివి. ఇది ఆనాటికి నాకున్న అవగాహనతో రాసింది.

"అనంత జ్యోతి' పేరుతో వెలువడిన మన కళాశాల విద్యార్థినీ విద్యార్థుల వార్షిక సంచికలో గల తెలుగు రచనలను చదివినప్పుడు, స్టూడెంట్స్‌లో గల ఆశావాద దృక్పథం ఆనందాన్ని కల్గించింది. జీవితం పట్ల ప్రతి ఒక్కరికీ ప్రేమ ఉంది. ఆత్మీయత కనిపిస్తుంది. భవిష్యత్తు పట్ల ఆశ ఉంది.

సమస్యల్ని చూసి చలించే గుణం ఉంది. ఆ సమస్యలకో పరిష్కారం తనదైన పద్ధతిలో చెప్పాలనే ఆరాటం ఉంది. ఇది మనిషిని సామూహికం చేస్తుంది. అందరిలో తన పాత్రను గుర్తు చేస్తూ, తోటివారిని జాగృతి చేస్తుంది. మతం పేరుతో జరిగే మారణ హోమానికి, కులం పేరుతో జరుగుతున్న కోట్లాట్లకి, ప్రాంతీయతల పేరుతో పెంచుకొంటున్న ద్వేషాలకీ యువతీ యువకులైన వీరు ముక్త కంఠంతో ఖండించడానికి ముందుకొచ్చారు.

జాతీయ సమైక్యత, వసుధైక కుటుంబాల్ని స్వాగతించడాన్ని బట్టి కలిసి బ్రతకటంలో గల ఆత్మీయానురాగాలకు విలువనిస్తున్నారు. అదే పరిస్థితిలో తమ అస్తిత్వాలకు భంగం కలగకుండా ఆత్మ గౌరవాన్ని కాపాడు కోవాలని అనుకొంటున్నారు. ఈ భావాల్ని అభివ్యక్తం చేయడానికి సమకాలీన సాహిత్యంలో బాగా ఆదరింపబడే వచన కవితా ప్రక్రియనే ఎన్నుకున్నారు.

సమకాలీన సాహిత్యంలో వచన కవిత్వానిదే పెద్ద పీట. సహజంగానే విద్యార్థుల్లో కూడా వచన కవిత్వం పట్లనే ఆసక్తి

పెరగడం, ఆ రూపంలోనే రాయడం జరుగుతుంది. కానీ కొంత మంది రాయడంలో మంచి భావుకత కనిపిస్తోంది.

కొంత మందికి "వస్తువు' తెలిసినా, కవిత్వీకరించడం కొంత ఇబ్బందయ్యినట్లు తెలుస్తుంది. ప్రయత్నిస్తే మంచి రచయిత్రులు, కవులు మన కళాశాల నుండి తయారయ్యే అవకాశం ఉంది. కొన్ని కవితల్ని సమీక్షిస్తాను. మీకే అనిపిస్తుంది ఇది చదివిన తరువాత ఇంత మంచి కవిత్వాన్ని మన వాళ్ళే రాశారా అని!!

"మౌనం' బాధను పంచుకుంటుందట! ఎంత చక్కని భావన. మనసు బాధ పడినప్పుడు ఏకాంతంగా గడపాలనిపిస్తుంది. ఆ ఏకాంతంలో "మౌనం' మన దగ్గరకొచ్చి ఓదారుస్తుంది. మనసు ఆనందంతో గంతులేయాలనిపించినప్పుడు కూడా కొంత మందికి మౌనంతోనే గడపాలనిపిస్తుంది. మౌనాన్ని ఇక్కడ మానవీకరించడం వల్ల మనిషికి ఏకాంతమనే ప్రశ్నే తలెత్తదు కదా! అప్పుడు ఏ మనిషీ ఏకాకి కాదు!

మనకి ఎవరూ తోడులేకపోయినా నేనున్నానంటూ, ఎవరు తోడు వచ్చినా, ఆ తోడుకి ఎంత విలువ ఉంటుందో చెప్పడం నిజంగా అనిర్వచనీయమైన అనుభూతి. అలాంటి భావనను కవిత్వీకరించి "మౌనం' ప్రతీకలో ఆ తోడుని వర్ణించడం నిజంగా ఆనందాన్ని కల్గించే మంచి కవితగా భావించాల్సిందే!

"నా నీడను సైతం వదిలి

నీతోనే నేస్తం నేను' ("మౌనం' సి. సంతోషి) అనడంలో, లోకంలో వ్యాపించిన ఒక నానుడి "నీడలా వెంటాడే' పంటి నాన్ని కూడా మించిన స్థితి ఇందులో ఉంది. వెలుగు పోయింది.

చీకటి వ్యాపించింది క్రీనీడా కూడా కనిపించడం లేదు.

చుట్టూ చీకటి, అయినా, ఇంకా ఏదో నీడా మసక మసకగా కనిపించవచ్చు. ఇలా కాదు లైట్లార్పేసి, ఒంటరిగా(?) దుప్పటి ముసుకేసేసినా, ఆలోచనల తుమ్మెదల రొదతో ఒంటరిగా వదలకుండా "మౌనం' లాలించింది.

బ్రహ్మ రాసిన అర్థం కాని రాతల వంటి ప్రశ్నలకి సమాధానాల్ని "మౌనమే' అందించింది. అంతే బరువైన గుండె, దూది పింజెలా ఆనందంతో గంతులు వేసింది. ఇదే ఎవరికైనా కావచ్చు. అందుకే కవిత్వం సార్వకాలీన భావనను అభివ్యక్తం చేసి, పదే పదే చదివించగలుగుతుంది. ఇంకా మరింత సాధన చేస్తే "కవిత్వం'లో "సంతోషి'కి మంచి భవిష్యత్తు ఉంటుందనిపించే కవిత "మౌనం'!

"మూగవోయిన గొంతుతో, మాటరాని మౌనంతో ఎలా వీడ్కోలు చెప్పాలో తెలియని అవ్యక్త భావనని కె.నగేష్ వర్ణించడంలో మంచి అనుభూతి కనిపిస్తుంది. పి. శివ కుమార్ రాసిన "తెలుగు తల్లికి జేజేలు' దేశభక్తిని వ్యక్తీకరిస్తూనే, ఆంధ్రుల వైభవోన్నతలను వర్ణించిన మంచి గేయం.

"రాయలసీమ ఆంధ్ర తెలంగాణాల

సమైక్యమే ఈ తెలుగు సీమ' అని సమైక్యతలోని సామరస్యాన్ని గొంతెత్తి ఆలపిస్తున్నాడు. నరసింహులు "జమ్మూ కాశ్మీర్లో' జరుగుతున్న మారణ హోమాన్ని ఖండిస్తున్నాడు.

జీవితం సముద్రంలోని అలల వలే ఆటుపోట్లకు గురికాక తప్పదనీ, "జీవితం నిరంతరం ప్రవాహం' లాంటిదంటాడు ఎం డి హాషమ్.

జీవించాలనుకోవడంలోనే జీవన పురోభివృద్ధి

కనిపిస్తుంది. లేకపోతే ఈ నాగరికత, విజ్ఞానం అంతా శూన్యం! "శూన్యాన్ని పోగొట్టి, అభివృద్ధి వైపు ప్రపంచాన్ని నడిపించగలగాలంటే ప్రతీ జీవితం ఒక ప్రవాహం కావాలంటాడు.

"డబ్బుతో కొనలేని స్నేహ పరిమళాన్ని వెదజల్లుతున్నాడు ఎం.డి. యాసీన్. వ్యక్తి గతంగా కూడా వినయ విధేయతలతో పాటు, విద్యా విషయక, సాంస్కృతిక, సామాజిక విషయాల పట్ల ఆసక్తి గలవాడు. అందుచేతనే ప్రజల్లో త్వరగా వ్యాపింపజేయగల ప్రక్రియ పాటను రాశాడేమో యాసీన్!

"ఇది జీవితానికి వెలుగునిచ్చే వెన్నెలా

మకరందం చిందించే తెల్లనైన మల్లెరా" అనడంలో "స్నేహం' వల్ల జీవితానికి వెలుగు రావాలి. అంటే విజ్ఞానం వికసించాలి. "వెలుగు" అనేది అనేక భావాల కూడలి. నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడే మిత్రుడి/ మిత్రురాలి జీవితంలో ఆశారేఖ వికసించడం వెలుగు. అమాయక తనం వల్ల అస్తవ్యస్త జీవితంలో నలిగిపోతుంటే, అర్థవంతమైన ఆలోచన చెప్పి సక్రమమైన మార్గం వైపు పయనించే వివేకాన్ని కలిగించడం వెలుగు.

ఇలా ఎన్ని వ్యాఖ్యానాలైనా చెప్పుకొనే అవకాశం ఉంది.

"మల్లె మొగ్గ' కొద్ది కాలమే ఉన్నప్పటికీ, జీవితాన్ని అంతటినీ త్యాగం చేసైనా ఆనందాన్నే కలిగించాలని కోరుకుంటుంది. "స్నేహం' అంత స్వచ్ఛంగా ఉండాలనే భావన ఇందులో ఉంది. కవుల బాధ్యతల్ని "బాలరాజు' తెలియజేస్తూ ఆశా కిరణాల ఉషోదయ మింకొకటి ఉందంటున్నాడు.

"వర్షమై రాలిన మేఘాల్ని కాదు

హర్షం పొందే కర్షకుణ్ణి వర్ణించు

మళ్ళీ సూర్యుడు అస్తమించడని ఆగిపోకు
ఆశా కిరణాల ఉషోదయమింకొకటుందని మర్చిపోకు"
(ఉషోదయం కె.
బాలరాజు)

మేఘాన్ని అస్థిరత్వానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. విశాలమైన ఆకాశాన్ని పరిశీలిస్తుంటే, మేఘాలు నడుస్తున్నట్లే ఉంటాయి. ఒకే చోట నిలబడవు. నిలబడినట్లు అనిపించినా, కొంతసేపైన తర్వాత మళ్ళీ చూస్తే, ఆ మేఘం అదే రూపంలో ఉండదు. రూపం మారిపోతుంది. అవసరమనుకుంటే మేఘమే మాయమవుతుంది. మేఘమంతా చినుకులుగానే రాలుతుందని అనుకోవడానికీ అవకాశం లేదు. కానీ మేఘంలో చిన్న భాగమైనా చినుకుగా రాలింది.ఆ చినుకుని చూసి ఆనందంతో కర్షకుడు భవిష్యత్తు పట్ల ఆశలు పెంచుకుంటున్నాడు.

పంట చేతి కొస్తుంది. తన సమస్యలన్నీ తీరిపోతాయని అనుకుంటున్నాడు. ఇంతవరకు ఏదో కథలా ఉంది కదూ! ఇలాగే అర్థం చేసుకుంటే "కవిత్వ' తత్వాన్ని అర్థం చేసుకున్నట్లు కాదు.

"కర్షకుడు' శ్రామికునికి ప్రతీక. శ్రామికుల అసంఘటిత శక్తికి "మేఘం' ప్రతీక. అసంఘటిత శక్తిలోనూ, ఎక్కడో ఓ "సంఘటిత' శక్తి ఉంటుంది. పోరాటం వైఫల్యం చెందినా, ఆ ప్రయత్నం చేయడం వల్ల అంతకుముందున్న పీడన నుండి విముక్తి భావ సూచనలు కనిపిస్తుంటాయి. ఆ సూచనలకు ప్రతీకగా "చినుకు'ను చెప్పుకోవచ్చు. ఇప్పుడు మళ్ళీ ఆ పాదాలు చదవండి. అందులో ఎంత కవిత్వం ఉందో తెలుస్తుంది.

పి. సునీత, వి. శ్రీనివాస్, ఎం వనమ్మలు మరింత కృషి

చేయవలసి ఉంది. ప్రకృతిలోని తాదాత్మాన్నీ దానితో గల అవినాభావ సంబంధాన్ని విశదీకరిస్తూ....

"ప్రాణమిచ్చే వాయువేనాడైనా

అడుగుతుందా నీ మతమేదని....!' అంటూ "వసుధైక కుటుంబం' కావాలంటున్నాడు జి. విజయ భాస్కర్ ఉప తేజేష్(మధు) రాసిన "అమ్మ' శిల్ప పరంగా కూడా మంచి కవిత. వస్తువు పాతదైన, "అమ్మ' ఎప్పుడు నూతనత్వమన్నట్లుగా, ఏ వస్తువుని తీసుకున్నా రాసే విధానాన్ని బట్టి మళ్ళీ మళ్ళీ చదివించగలిగేటట్లు రాయడం నిజంగా అభినందనీయమైనదనే చెప్పవచ్చు. అనిత రాసిన "అస్తిత్వం' మంచి కవిత.

"శిఖరంపై వృక్షానివి కాలేక పోయినా

శిశిరాన్ని మాత్రం నింపుకోకుండా

శిఖరంలాంటి ధైర్యంతో నిలువు" (అస్తిత్వం సి. అనిత)

పుట్టిన వాడు గిట్టక మానడు. ఏదొక నాడు మరణించక తప్పదు. అయితే బతికినంతకాలమైనా ఎలా బతికామనేదే ప్రశ్న! ప్రవాహంలో కొట్టుకొని పోయేది కొంతమందైతే, ఎదురీదేవారు ఇంకొందరు. అసలు దాని దరిదాపుకే వెళ్ళని వాళ్ళూ ఉంటే, ప్రవాహాల్నే సృష్టించే వాళ్ళు ఉంటారు.

పుట్టుకతో వచ్చే గుణాలతో కొంతమంది, తర్వాత అలవర్చుకున్న గుణాలతో మరికొంత మంది కనిపిస్తుంటారు. ఎలాంటి గుణం కలిగినా, మనిషికి ఒక అస్తిత్వమనేది ఉండాలి. అది పిరికితనంతో కూడిందో, నిరాశాజనకమైందో కాకూడదు.

జీవితాన్ని వసంతంలా మార్చుకోవడమో, శిశిరంలా ఎండబెట్టు కోవడమో మన చేతుల్లోనే ఉంటుంది. ఆలోచనలు

ఉన్నతంగా ఉండాలి. "శిఖరం' ఉన్నతత్త్వాన్ని సూచిస్తుంది. ఆ ఆలోచనలు కార్య రూపంలో జరగనంత మాత్రం చేత, ఇంకేమీ చేయలేమనే ఆలోచన కొచ్చేసి, నిస్తేజంగా మారిపోకూడదు.

"శిశిరం'లో ఆకులన్నీ రాలిపోతాయి, మోడువారిన చెట్లు కనిపిస్తుంటాయి. జీవరహితంగా కనిపిస్తుంటాయి. అలా ఏదైనా మన జీవితంలో ఉన్నతమైన లక్ష్యంతో ముందుకి పోవాలనుకున్నప్పుడు, ఎదురు దెబ్బలు తగలవచ్చు మన చుట్టూ ఉన్నవాళ్ళే మనకి, చెట్టుకున్న ఆకుల్లా దూరం కావచ్చు. కానీ, ధైర్యంతో నిలవగలిగి మళ్ళీ ప్రయత్నించాలి.

వసంతం వస్తుంది. అంటే చెట్టు మళ్ళీ చిగురిస్తుంది. మంచి పువ్వులు విరబూస్తుంది. చెట్టంతా ఆకులతో పచ్చగా కళకళలాడుతుంది. విజయ పథాన్ని చేరుకున్నప్పుడు మనకీ అదే పరిస్థితి. "ఛీ' కొట్టిన వాళ్ళే "జై' కొడతారు.

దీనికి ఓపిక కావాలి, సహనాన్ని అలవర్చుకోవాలి. అప్పుడు మన నిజమైన "అస్తిత్వం' ఏమిటో బయటికొస్తుంది. శబ్ద పునరుక్తి పట్లా, శిల్పం పట్లా కొంచెం శ్రద్ధ తీసుకొంటే "అనిత' మంచి కవిత్వం రాయగలుగుతుందని ఈ కవితే చెబుతుంది. జీవితానికో పరమార్థం ఉందని, అంధకారాన్ని వెలుగుగా మార్చుకోవచ్చనీ, దీనికి అంతటికి ఓ తోడుంటే చాలంటున్న ఎం. నాగరాజులోనూ, అద్వైత భావాన్ని అర్థం చేసుకోమంటున్న టి.అమరనాథ్, చంద్రశేఖర్లు కూడా ప్రయత్నిస్తే మంచి కవితలు రాయగలరు. తిరుపతయ్యలో ఉన్న సెలయేరు లాంటి తన భావుకతతో మనకి కదిలే రంగుల స్వప్న మధురిమలను పంచుతున్నాడు.

పోటీ వ్యాసాల్లో కొన్ని భాగాల్ని మాత్రమే ప్రచురించాం.

చక్రధర రావు మంచి శైలిలో వ్యాసాన్ని రాశారు. మంచి భావుకత ఉందనిపించింది. రాజేశ్వరిలో మంచి భావాలు ఉన్నాయి. ఇంకా ప్రయత్నించాలి.

దివాకర శాస్త్రి ఛందోబద్ధంగా ప్రయత్నించడం మంచి పరిణామమే కానీ కృషి చేయాలి.

సామాజిక స్పృహగల ఇతివృత్తాన్ని స్వీకరించటం మాత్రం అభినందనీయం. వార్షిక సంచికలో కథ కేవలం ఒకటే ఉంది. "బొమ్మ' ఇతివృత్తం మంచిదే, స్త్రీవాద ఛాయలు గల ఇతివృత్తం. ఇంకా శిల్ప పరంగా పరిణతి సాధించాల్సి ఉంది.

కేవలం సంభాషణలు రాసినంత మాత్రాన కథ అనిపించుకోదు. శైలీ పరంగా చూసినపుడు సమకాలీన సమాజాన్ని అర్థం చేసుకున్నట్లు స్పష్టమవుతూనే ఉంది. "టిఫినీలు' వంటి ప్రయోగాలు సహజంగా, హాస్య భరిత వర్ణనతో ఉన్నాయి. తండ్రీ, కొడుకు, కోడళ్ళ మధ్య నలిగిన ఒక స్త్రీ తన జీవితాంతం "బొమ్మ'గా మాత్రమే జీవించిందనీ, జీవం ఉన్న మనిషిగా జీవించలేకపోయిన ఒక జీవితాన్ని చిత్రించడానికి జరిపిన ప్రయత్నం "బొమ్మ' కథ. మంచి కథలు చదవాలి. శైలని అవగాహన చేసుకోవాలి. సన్నివేశ కల్పనను రూపొందించుకోవాలి.

అభ్యాసం

సృజన ప్రక్రియలు అనేకం ఉన్నాయని ముందే చెప్పుకున్నాం కదా! ఇప్పుడు వచన కవిత్వాన్ని సాధన చేద్దాం. ఏదైనా ఒకే వస్తువుని తీసుకొని దాన్ని ఎన్ని పద్ధతుల్లో కవిత్వీకరించవచ్చో దీని వల్ల తెలుస్తుంది.

నేను హైదరాబాదు విశ్వవిద్యాలయంలోనే చదువుకొని, ఇక్కడే అధ్యాపకుడు ఉద్యోగం సాధించాను. ఇక్కడ ఇంచు మించు ప్రతి విద్యార్థీ హాస్టల్ లోనే ఉంటారు. హాస్టల్ లో చాలా సార్లు భోజనం చాలా వృధా చేస్తుంటారు. ప్రతి నెలకీ మెస్ మెయింటనెన్స్ చేయడానికి విద్యార్థులు మారుతుంటారు. వాళ్ళు తెల్లవారగట్లే లేచి వంటకు కావలసినవన్న ఇవ్వాలి. అప్పుడు అక్కడ మిగిలి పోయిన అన్నం పట్టి కెళ్ళడానికి క్యాంపస్ లో పనిచేయడానికి వచ్చిన కూలీల పిల్లలు, వాళ్ళ తల్లులు వస్తుంటారు.

రాత్రి మిగిలిపోయిన అన్నం పట్టుకెళ్ళడానికి మాకంటే ముందువచ్చి మెస్ తలుపు ఎప్పుడు తీస్తారా! అని ఎదురు చూస్తుంటారు. తలుపులు తీయగానే మెస్ వర్కర్స్ ఆ అన్నాన్ని పడేయకుండా, తినడానికి పట్టుకెళ్ళాలని లోనికి వస్తుంటారు. అప్పుడు మెస్ వర్కర్స్ ఆ వచ్చిన వాళ్ళని నానా తిట్లు తిడుతుంటారు. నేనూ ఒక నెలలో మెస్ సెక్రటరీగా చేయాల్సివచ్చింది. అప్పుడు అవకాశం వచ్చింది.

అప్పుడు మిగిలిపోయిన, పడేసే అన్నం పట్టికెళ్ళడానికి వచ్చే వాళ్ళ మానసిక స్థితిని గమనించాను.

ఒక రోజు మెస్ వర్కర్ అన్నం పట్టికెళ్ళడానికి వచ్చిన పిల్లని కొట్టబోతే, ఆ పిల్ల పారిపోయి, వాళ్ళు పడేసిన తొట్టిలో నుండి ఆ అన్నాన్ని దొంగచాటుగా తీసుకుని వెళ్ళింది. ఇది చూసి నేను రూములోకి వెళ్ళిపోయి, తలుపేసుకొని చాలా సేపు ఏడ్చేశాను. అప్పుడే " హాస్టల్లో అమ్మ " పేరుతో కొన్ని వచనాలను రాశాను. అప్పటికి నా మనసేదో కొంత తేలికయ్యింది. ఆ కవితను ఇక్కడ ఇస్తున్నాను.

హాస్టల్లో అమ్మ

మా యూనివర్సిటీ హాస్టల్లో
మిగిలిన అన్నం పట్టికెళ్ళడానికి
తెల్లవారగట్ల వచ్చే ఓ తల్లి దీనవదనంలో
మా యమ్మ రూపం అందంగా కన్పిస్తుంటుంది
నన్ను పెంచిన తీరు
ఆ తల్లిలో ప్రతిబింబిస్తుంటే
నా కళ్ళ ఎడారిని
ఓ జాలి నిట్టూర్పు
దయతో ఆర్ద్రమై తడుపుతుంటుంది!

మా ఊరి పెళ్ళి పందిళ్ళలో
ఆకలి పాత్రనై అమ్మ చేతుల్లో ఒదిగినప్పుడు
చెత్తకుప్పల్లోనైనా పడేసి రంకేసే
కఠినాత్ముల కర్కశ కేకలకి
తల్లడిల్లిన నా తల్లి హృదయాన్ని
అప్పుడప్పుడూ
మా హాస్టల్లో వీక్షిస్తుంటాను!

నిస్సహాయుడనై
చీకటి గదిలో ఒంటరినై
నాలో నేను కన్నీటి కెరటాల్లో కొట్టుకుపోతుంటాను.

ఎక్కడ నుండో అమ్మ అమృత హృదయమై
లాలిస్తూ, జోలపాడుతూ
ఆకలినీ, అవమాన ప్రపంచాన్నీ జయించమనే
మేలుకొల్పు గీతం విన్పిస్తుంటుంది!

-0-

తర్వాత దీన్ని పత్రికకు పంపాను. ప్రచురించారు. తర్వాత దీన్నే రంజని వాళ్ళు "అమ్మ" కవితా సంకలనం ప్రచురిస్తున్నారని ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు మా తరగతిలోనే సూచనా మాత్రంగా చెప్పారు. అప్పుడే నా కవితను కూడా ఆయన మెచ్చుకున్నారు. అయితే పేరు పెట్టి చెప్పకుండా ఆధునిక సాహిత్యం గురించి పాఠం చెప్తూ నేడు యువకులు కూడా తాము కోల్పోతున్న మానవీయ సంబంధాలను అమ్మ, మా ఊరు పేర్లతో కవిత్వంగా, కథలుగా రాస్తున్నారంటూ నా వైపు అనురాగంతో చూశారు.

తర్వాత ఆయన్ని కలిస్తే చూపు పత్రికలో దళిత కవిత్వంలో తల్లి అనే వ్యాసాన్ని చదివానని చెప్పారు. ఆ వ్యాసాన్ని ఎం.ఏ.లో ఉండగానే రాశాను. అప్పుడే అమ్మ గురించి వచ్చిన అనేక కవితల్ని సేకరించుకొని పెట్టుకున్నాను. వాటిని రంజని వాళ్ళు పుస్తకంగా ప్రచురించి, నా గురించి కూడా ("అమ్మ" కవితా సంకలనం 1997 : 24) ప్రముఖంగా పేర్కొన్నారు. అందులో ఈ కవితను ప్రచురించారు. ("అమ్మ" కవితా సంకలనం1997:115) దీన్నే ఈ పుస్తకంలో నుండి తీసుకొని ప్రజాశక్తి వాళ్ళు 22.12.2001 లో పునర్ముద్రించారు.

దీన్ని మీరు గమనిస్తే అన్నం పట్టుకుని వెళ్ళడానికి

వచ్చిన తల్లి గురించి ఆత్మాశ్రయ పద్ధతిలో చెప్పాను. గ్రామీణ ప్రాంతాల్లో పెళ్ళిళ్ళు జరిగేటప్పుడు కనిపించే సంఘటనలతో కవిత్వీకరించాను.

ప్రతి కవి తన అమ్మ గురించి ఏదొక రూపంలో వర్ణించే ఉంటాడు. "అమ్మ" కవితా సంకలనంలో "అమ్మ" అనే వస్తువుని అనేక పద్ధతుల్లో వర్ణించిన కవితలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని గమనిద్దాం.

అమ్మ గురించి నేనేమీ చెప్పలేకపోతున్నానంటూనే అమ్మ గురించి చెప్పటం ఒక పద్ధతి. ఆర్వీయస్. సుందరం "కన్నీటి సరస్సును మిగిల్చి అమ్మ వెళ్ళిపోయింది" (పుట : 42, 43) పేరుతో ఒక కవితను ఇలా రాశారు.

"అమ్మను గురించి చెప్పాలనుకున్న ప్రతిసారీ
ఊహల పక్షులు గూటిలోనే
బిక్కుబిక్కుమని చూస్తున్నాయి.
భావనాకాశంలో వర్షించే మేఘం
ఒక్కటీ కనిపించడం లేదు.
కన్నీటి సరస్సును శాశ్వతంగా మిగిల్చి
అమ్మ ఏ తీరానికో వెళ్ళిపోయింది.
చెప్పలేను
చెప్పకుండా ఉండలేను
అనుభూతికీ అభివ్యక్తికీ అంకితమైన
వ్యక్తి కదా
వ్యక్తావ్యక్త పరివేదన!

ఇలా సాగిపోతుంది కవిత. చెప్పలేనంటూనే వర్ణిస్తూ ముందుకెళ్ళిపోతున్నాడు కవి. అమ్మ గురించి చెప్పలేక పోవడమంటే, అమ్మ గురించి శక్తివంతంగా

వర్ణించాలనే తపన కవిలో ఉందని అర్థం చేసుకోవాలి.

రాయాలనే ఆసక్తి ఉండాలి గానీ, శ్రీశ్రీ అన్నట్లు కాదేదీ కవితకనర్హం. దీన్నే ఇంకా పాతకాలంలోకి వెళ్ళి చెప్పాలంటే దశ రూపక కర్త ధనంజయుడు మాటల్ని ఉదాహరించుకోవాల్సిందే!

" రమ్యం జుగుప్సితముదారమథాపి నీచమ్
ఉగ్రం ప్రసాది గహనం వికృతంచ వస్తు
యద్వాప్యవస్తు కవిభావక భావ్యమానమ్
తన్నాస్తి యన్నరసభావము పైతిలోకే"

అంటే, రమ్యం కావచ్చు; రోత కొలిపేది కావచ్చు; ఉదారంగా ఉండవచ్చు; అధమం నీచమైనది కావచ్చు; భయంకరమైనది కావచ్చు; సంతోషాన్ని కలిగించేది కావచ్చు; గంభీరం కావచ్చు; వికృతంగా ఉండవచ్చు; దానిలో వస్తువు ప్రధానమైనా, కాకున్నా, కవి దాన్ని ఒక సృజన కార్యంగా భావిస్తే, రసవంతమే అవుతుందని అర్థం. కనుక, కవి నైపుణ్యం రచన రూపొందడంలో చాలా ముఖ్యం అని గమనించాలి.

తనని ఎవరైనా నిందించినప్పుడు గానీ. మెచ్చుకున్నప్పుడు గానీ తనని పెంచిన అమ్మని గుర్తుచేసుకుంటూ తన కథను కవితాత్మకంగా చెప్పవచ్చు. నగ్నముని అలాగే వర్ణించాడీ కవితను!

"పాలు ఎర్రబడ్డాయి" పేరుతో రాసిన ఈ వచన కవిత ఇలా ప్రారంభమవుతుంది.

" ఈగలూ, దోమలూ చీమలూ చీమిడీ
బురదా బూతులూ రొచ్చూ రొంపూ
కుండలూ మెతుకులూ కలరా పెంటా
ఇవీ నా బాల్యం.

నాకిప్పుడు అకస్మాత్తుగా
మేడల సంస్కారం చదువుల సంస్కారం ఎట్లావస్తుంది
అప్పుడు నేను నెలల పిల్లవాణ్ణి
పాలు తెల్లగా ఉంటాయనుకునేవాణ్ణి...." ఇలా తన గురించి చెప్పుకుపోతున్నట్లు కథనాత్మకం కవిత ఉంటుంది. తన తల్లి తమని పెంచడం కోసం పడుపు వృత్తి చేసేదని తెలుసుకుంటాడు. అందుకు ఆ పిల్లాడి కోపం వస్తుంది. అయితే ఆ కోపం తల్లిపై కాదు.ధన మధాంధులపై వస్తుంది.

" అప్పుడు నేను నెలల పిల్లవాణ్ణి
అమ్మ రాత్రుళ్ళు డబ్బులు సంపాదించడానికి
వెళ్ళినప్పుడాల్లా
తాటి గుంజకు ఆనుకుని కునుకుతూ
నేనేడినప్పుడల్లా అక్క ఆడించేది
లాలించేది జోకొట్టేది నవ్వించేది
ఆకాశం మెరిసినా ఉమ్మినా
అమ్మ ఏడవడం ఎప్పుడూ నే చూళ్ళేదు
అక్క నా ఏడుపుకి విసుక్కోవడం
నేనెప్పుడూ చూళ్ళేదు
ఆ కటిక రాత్రి మాత్రం బాధకే ఏడ్చిందో
నాన్న గుర్తొచ్చి ఏడ్చిందో
నాకు పాలివ్వడానికుండా అమ్మ ఏడుస్తూనే కూర్చుంది"

అని తన కథను అంతా చెప్తున్నట్లే వర్ణిస్తాడు కవి.ఆ పిల్లాడు ఏడ్చియేడ్చి నిద్రపోవడం, నిద్రలో ఉండగానే తల్లి రావడంతో ఆ హాయికి ఆపిల్లాడు పాలుకోసం వెతుక్కుంటాడు. అప్పుడు...

" నా కడుపు నిండా ఆకలి

చీరనీ జాకెట్నీ చేతుల్తో తప్పించుకుంటూ
కాళ్ళతో ఒడిని తన్నుకుంటూ
అమ్మ బాయిని ఆత్రంగా
ఇంక నే బతకలేనట్టు నోట్లో పెట్టేసుకున్నాను
కళ్ళు మూసుకునాను
పాలు నా నోటి నిండా చిమ్మి
కడుపు నిండుతాయని ఆనందం
కాని ఆ వేళ అమ్మ బాయి నా నోటికందడం లేదు
కళ్ళు తెరిచి రెండు చేతులా వెతికాను
అమ్మ బాయి పీక తెగిపోయి వేలాడుతోంది
ఏ ఘరానా రాక్షసుడో డబ్బుకి దొరికింది గదా అని
పళ్ళతో కొరికేశాడో గోళ్ళతో పీకేశాడో
అమ్మ బాయి పీక తెగిపోయింది
అమ్మ కళ్ళనిండా నీళ్ళు
నా చేతుల్నిండా
మూతినిండా రక్తం
అప్పుడు తెలుసుకున్నాను
నాలాంటి వాళ్ళ అమ్మ పాలు
తెల్లగా కాదు ఎర్రగా వుంటాయని!'' ఈ కవిత చదువుతున్నప్పుడు చాలా మంది కన్నీళ్ళు కార్చడం చూశాను. చాలా చిన్న చిన్న మామూలు పదాలతోనే కవిత రాశారు. ఒక జీవిత బీభత్సమంతా ఈ కవితలో ఉంది. కన్యాశుల్కం నాటకంలో హాస్యం పైకి కనిపించినా నాటకం అంతర్భాగమంతా విషాదమే పరుచుకొని ఉంది. ఇక్కడ వేశ్య అనగానే పైకి కనిపించేది శృంగారమైనా, అంతర్భాగంగా బీభత్సమైన విషాద

జీవితం ఉంది.

దీన్ని ఆత్మాశ్రయ కథాకథన పద్ధతిలో కవితని వర్ణించి పాఠకుల్లో సంవేదన కలిగించగలిగాడు. ఆధునిక కవిత్వం, కథానికల్లో "నేను" రచయితే కానక్కర్లేదు. ఇంకా చెప్పాలంటే రచయిత దాన్ని సమాజం నుండి స్వీకరించి ఆ పద్ధతిలో చెబితే బాగుంటుందని భావించాడని గుర్తించాలి.

తన తల్లికి ఉత్తరం రాస్తున్నట్లుగా బాలగంగాధర్ తిలక్ "సైనికుని ఉత్తరం" రాశాడు. అలాగే సెంట్రల్ యూనివర్సిటిలో సునీత అనే ఒక దళిత అమ్మాయి తాను ప్రేమించిన వ్యక్తి పెండ్లి చేసుకోకుండా చనిపోయినప్పుడు యూనివర్సిటీ విద్యార్థులు వేసిన "సునీత పొద్దున్నే పోస్టరై నిలిచింది" పేరుతో కవితా సంకలనం వేశారు. దానిలో ఉత్తరం రూపంలో ఒక చక్కని కవిత ఉంది.

అమ్మ తనకు ఉత్తరం రాసినట్లు ఒక ఉత్తరంగా మద్దూరి నగేష్ బాబు దళిత జీవితాన్ని వర్ణించాడు.

" మీరంతా కుశలమేనని
ఏదేవుణ్ణి నమ్మి అనుకోమంటావమ్మా ?" అంటూనే

ఇలా వర్ణిస్తాడు.

" ఎవర్ని నమ్మించాలనే అమ్మా
అందరూ క్షేమమని రాయిస్తున్నావూ?
అసలు మన పల్లెలో తడికాని కన్నున్న ఇల్లు
వొక్కటైనా వుందా?" అని అక్కడ అంత సంతోషంగా

లేకపోయినా, సంతోషంగా ఉన్నామని దళిత కుటుంబాలు తమ కొడుకులకూ, కూతుళ్ళకూ రాస్తున్నా వాస్తవం తెలియదా అంటున్నాడు. ఇదొక చక్కని కవిత్వ పద్ధతి.

273126

మరి అక్కడ క్షేమంగా లేని తల్లిని ఎలా గుర్తించాడు?
" నేను ఈతకొట్టి చేపలు పట్టిన అలుగులో
ఆ మధ్య నెత్తురు పారటం
నాకు తెలియదనుకున్నావా?" అని వర్ణించి,
" నీవు దాచుకుందామనుకున్న కన్నీటి చుక్కొకటి
నీకు తెలియకుండానే
నీ ఉత్తరం మీంచో మహానదై జాలు వారిందేమో
నీ దమనుల్లో ధ్వనిస్తున్న దు:ఖాంశ
నా గుండెకు చేరిపోయిందమ్మా" అని ఉత్తరం రాయించేటప్పుడు అప్రయత్నంగా కార్చిన కన్నీళ్ళను బట్టి గుర్తుపట్టేశానంటాడు కవి.

నిజానికి దళితులందరి జీవితాన్ని ఈ కవిత ప్రతిబింబిస్తుంది.

ఉత్తరాల ద్వారా చాలా మంది కవిత్వాన్ని రాస్తుంటారు. ఇదే పద్ధతిలో నేనూ ఒక కవిత రాశాను.

యూనివర్శిటీలో పరిశోధన చేస్తున్న రోజుల్లో రాసిన కవిత ఇది.



ఎక్స్ రే రిపోర్ట్

"అద్దం ముందు నిలబడిన నిజం
ఎక్స్ రే తీసి ఎగతాళి చేస్తుంది
నన్నురమ్మని ఎన్ని సార్లు రాసినా
ఇంటికెళ్ళి మళ్ళీ తియ్యాని మాటలతో
జీవరహిత ముఖం చూపడానికిష్టం లేకనే బిజీ వేషం!" అని ఇంటి దగ్గర నుండి పండక్కైనా రమ్మని ఉత్తరం రాసినప్పుడు, పరిశోధనలో బిజీగా ఉన్నానని చెప్తూ రాసేవాడిని. త్వరలోనే

ఉద్యోగం వస్తుందనీ, దానికోసం కూడా ప్రిపేర్ అవుతున్నానని నమ్మించేవాడిని. అదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ రాయాలంటే ఏదో తప్పుచేస్తున్నట్లు అనిపించేది. అందుకే మళ్ళీ జవాబు రాయకుండా గడిపేసేవాడిని. కానీ, మళ్ళీ ఇంటిదగ్గర నుండి ఉత్తరం ఏదైనా వస్తుందేమోనని లేదా ఏదైనా ఉద్యోగానికి సంబంధించిన కాల్ లెటర్ వస్తుందనీ రోజూ పోస్టుమ్యాన్ వచ్చేటప్పటికి ఆలశ్యమవుతుందేమోనని ఆఫీసుకే వెళ్ళేవాడిని. ఉత్తరాలు ఏమీ లేవని చెప్పినప్పుడు సరిగ్గా చూడలేదేమో నని మళ్ళీ చూడమనే వాడిని.

ఒక విద్యార్థిగా ఉంటూనే పరిశోధన చేయడానికి అవకాశం కలగనివ్వని పరిస్థితుల్ని తలచుకుంటూ కుమిలి పోయేవాడిని. మరోవైపు నాతోటి విద్యార్థులు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కోసం ప్రిపేర్ అవ్వడానికి కోచింగ్ సెంటర్స్ కి వెళ్ళేవారు. నాకూ వెళ్ళాలని ఉండేది. కానీ, యూనివర్సిటీ పరిస్థితులు ఆటంకంగా నిలిచేవి. అవి ఇప్పటికీ చెప్పుకోలేను. నా బాధనెలా వ్యక్తీకరించాలని ఆలోచించేవాడిని. డైరీ రాసుకొనేవాణ్ణి. అయినా ఏదో వెలితిగా ఉండేది. అప్పుడే కవిత్వంగా నా బాధను రాశాను. ఇది చదివి "నాపరిస్థితి కూడా ఇలాగే ఉందిరా" అని మా విద్యార్థులు అంటుండేవారు.

మళ్ళీ ఎప్పుడో ఇంటి నుండి ఉత్తరం వచ్చేది.

"నువ్వు ఎలా ఉన్నావో తెలియక భయపడుతున్నాం. ఓ కార్డు ముక్క రాయవచ్చుకదా" అదీ సారాంశం.

ఉత్తరం రాసే వాణ్ణి. తర్వాత మళ్ళీ బాధ పడేవాణ్ణి. ఆ పరిస్థితిని వర్ణిస్తూ ఇలా రాశాను.

" ఉత్తరం రాయడం నేరమే

అబద్దాల్ని అందంగా పోస్టు చేసి
భ్రమల్ని పెంచుకునేలా చేసి
ఉత్తరం రాయడం నేరమే!
రోజూ ఉత్తరానికెదురు చూసే చూపులకి
పొస్టుమేన్ కైనా
తానే ఓ ఉత్తరం రాయాలనిపించదూ...!" ఇది నిజంగా జరిగింది. మా పోస్టుమ్యాన్ నాతో సరదాగా అన్నట్లు ఒక సారి "నేనే రాస్తాలెండి" అని అనేసాడు.

నేనేమి చేసే వాణ్ణి మరి. దాన్నిలా వర్ణించాను.

"నగర వీధుల్లో నేను
నాకు నేనే మోసం
శోధనో...పరిశోధనో?
వినయం బానిసత్వమైతే
జీవితం మోయలేనంత బరువు"

సూపర్ వైజర్ ఏదైనా పని చెప్తే చేస్తాం. కానీ, చేస్తున్నాడు కదా అని చిన్నపనికీ, పెద్దపనికీ వినియోగించుకుంటే ఎలా ఉంటుంది. ఇలా ఉందని మా యూనివర్సిటీలో నాతో పాటు రీసెర్చ్ చేసే స్కాలర్స్ చెప్పుండేవారు. వీటన్నింటినీ ఆత్మాశ్రయంగా నాకే జరిగినట్లు రాశాను. అలాగని నా జీవితానుభవంలో ఈ పరిస్థితి లేదని కాదు. కానీ, ఇదంతా నా జీవితానికి సంబంధించిందే కాదని కవిత చదివి అనేక మంది రీసెర్చ్ స్కాలర్స్ అన్నారు.

ఇంకా కవిత ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, ఆగస్టు: 2001లో ప్రచురితమయ్యింది. తర్వాత ఇది ఆంగ్లంలోకి కూడా అనువాదం అయ్యింది.

వివిధ పత్రికల్లో ప్రచురితమైన నా కొన్ని కవితలను ఇక్కడ అందిస్తున్నాను.

నగర పురస్కారం!

నగరం నన్నక్కున చేర్చుకుంటుందనుకున్నాను
పగలనక, రాత్రనక
ఆకలనక, దప్పికనక
నీరస మనక, నిద్రనక
నగర నిర్మాణంలోనే కలిసిపోయింది నాజీవితం!
తాజ్ మహల్ నిర్మాణంలో కూలీలెవరైనా
పవిత్ర ప్రేమకు పునాదులయ్యో
వెన్నెల చల్లదనంలో శ్రమను మెరిపించే కుడ్యాలయ్యో
మహాకవి కవిత్వమయ్యో నిలవగలిగారు
నగర నిర్మాణాన్ని చూద్దామని మురిపంతో రోడ్డు మీదకొస్తే
నడివీధి నడకలో నెర జాణత్వ మెలికలు లేవని
కాళ్ళు విరగదీసి నన్నో వికలాంగుణ్ణి చేసింది
నగర ఒక పువ్వయ్యింది- నా ముక్కుకి తాళం పడ్డది
నగరం ఒక ఫలమయ్యింది- నానోరు కట్టి వేయబడింది
నగరం ఒక ఇంద్ర భవనమయ్యింది- నా అస్తిత్వాన్ని భస్మం చేసింది
నగరం నన్నక్కున చేర్చుకుంటుందనుకున్నాను
నగరం నా ఇల్లనుకున్నాను
నగరం నా ఆత్మీయబంధువనుకున్నాను
నగరమే నేను-నేనే నగరమనుకున్నాను
నగర నిర్మాణంలోనే అణువునైపోయాను
నగరం నన్ను తిరస్కరించింది

నన్ను తిరస్కరించిన నగరం పురస్కారానికి ఎంపికయ్యింది!
నగరమిప్పుడు శ్రామికుని రసాన్నంతా పీల్చేసి
చొప్పనుకూడా కాల్చేసే మానవ స్వభావం!

- 0 -

ఇప్పుడు నా శ్లోకంలో...!

కణ్వుడి ఆర్ద్రత నాకిష్టం
కర్ణుడి ఆవేదనతో కదిలిపోవడం నాకిష్టం
కరుణశ్రీ కవిత్వంలో తడిసిపోవడం నాకిష్టం
అన్నింటికంటే నాన్నంటే నాకిష్టం!
ఆరుమానెల గింజలకోసం
పదహారు మైళ్ళు వెళ్ళి
అర్థరాత్రి వరకూ తడిసి ముద్దయిన నాన్నంటే నాకిష్టం!
అర్జునుడు అన్నం ముద్ద
కరెక్టుగా తిన్నాడో లేదో నాకు తెలియదు గానీ...
కాళరాత్రుల్లోనూ నాన్న గునపం పోటుకి
పెరుగు గడ్డలా విరిగిన మట్టి బెడ్డల బరువు నాకు తెలుసు!
రేపల్లెలో కృష్ణుడు రజితపాన్పుపై
పవళించాడో లేదో తెలియదు గానీ...
నాన్న వరిగింజల్ని జల్లెడ పడుతుంటే
వెన్నెలరాణి నివ్వెరపోయి చూడటం నాకు తెలుసు!
నాన్నను వెలేసిన శ్లోకం
శోకాన్నే మిగిల్చిన శ్లోకం
నాన్నపాదాలపై పడిందిప్పుడు!
నాన్నకిప్పుడు శ్లోకం సొంతం
నాన్నిప్పుడు నాలో ఉన్నాడు!!

స్థానిక గొంతుల్నీ వినండి!

ఆర్పవలసింది ముందు బ్లోఅవుట్స్ ని కాదు
అవన్నీ తాత్కాలికమే
తరలిపోతున్న సంపద కాలి బూడిదవుతున్న ప్రాంతం
ఆ మట్టిలో పుట్టినోళ్ల నోళ్లల్లో మట్టి
దోబూంచులాటల్లో మోసం
తప్పని సరై రగులుతున్న గుండెమంటలు
ఈ మంటల్నార్పండి ముందు!
రాయలసీమ తెలంగాణ కోనసీమ ...ప్రాంతం విడిపోతేనేమి
అస్తిత్వ పోరాట ధ్వనుల్లో స్థానిక గొంతుల్ని వినండి
రియల్ ఎస్టేట్స్, ఇండస్ట్రియలిస్ట్స్, బ్యూరోక్రాట్స్...
పేర్లేవైతేనేమి దోపిడీల నయావలసవాదమే
ఫ్యాక్షనిజం, క్యాస్ట్ పాలిటిక్స్, ఆక్వాకల్చర్ ... అంతా పొల్యూషనే!
పూరి గుడిసెలన్నీ ప్రొక్లెయిన్స్ కే బలి
అంతర్జాతీయ రింగ్ టోన్స్
ఆకాశ హార్మ్యాల్లో "గూడు' పురాణీలు
ప్రతీ ప్రాంత మిప్పుడు డ బ్ల్యు టి వో ముగ్గులతో కళకళలే!!
ఒక్క ప్రాంతమైనా చూడగలరా....?
ఇవిగో నమ్ముకున్న నేలతల్లికి పెట్టిన రంధ్రాలు
చమురన్వేషణలో పచ్చదనాల్లోని విధ్వంసాలు
కుప్పకూలిన చెట్టంత అనుబంధాలు
పైసా పైసా కూడబెట్టుకున్న అరెకరం
కొండచిలువలు మింగేసిన రొయ్యాల చెరువు
చూపలేనివి ఇంకా ఎన్నెన్నో...

పేదరాసి పెద్దమ్మ వరిగ గింజల్ని కలబెట్టు కోవడానికే
కరువైన కట్టెలు
శవాన్ని తగలబెట్టడానికెలా వస్తాయ్
గ్యాసిక్కడే వుడుతున్నా దాన్ని ఇంధనంగా మార్చుకోలేని అశక్తత
ఒంట్లో ఇంట్లో కంట్లో అన్నింట్లో ఏవేవో ప్రలోభాలు
కోనసీమిప్పుడు డబ్బుకట్టల్ని ప్రపంచ బ్యాంకుకి మోసే కూలీ
కోనసీమిప్పుడు బ్లోఅవుట్స్ రూపంలో రక్తం కక్కుతున్న కలర్ టి.వి.
కోనసీమిప్పుడు ఓ దారుణ ప్రియ దర్శనం!!

--0--

నాన్న స్పర్శ

వలస పక్షికిప్పుడేదో విరిగిన చప్పుడు
చెట్టునిండా పండ్లు
కొమ్మల్నీ, రెమ్మల్నీ అలమకున్న ఏకాకులు
పండిన వెలితి ఎంత తీయని బంధం
నోట్లో ఊరు తున్న కాకర కాయ రసం
పొద్దున్నే భుజాన్నెక్కుతున్న సూర్యుడు
రైలు దిగినప్పుడు వెన్నెలవుతాడు
పాదలేపనాలు, అగ్నిహోత్రాలు మంత్ర మహిమలు,
యంత్రభూతాలు, హిమాలయాలు, స్వర్గనరకాలు
ఏకధాటిగా కురిపించిన రసం
ఉక్కిరి బిక్కిరై చందమామ కౌగిళ్ళలో రసాభాసం
తట్టుకోలేకపోతున్నాను
కాసేపు మట్టి వాసనల్నీ, పైరుగాలినీ పీల్చాలి
అవిగో నీటి కయ్యల్లో ఎగిరపడే చేదివరిగలు

నాన్న విసిరిన పువ్వుల్లాంటి వలలో తెచ్చే నీటిదండలు
ఆకాశమంత ఎత్తు నుండే నాన్న అందించే ముంజకాయలు
పొలాల్లో పలకరిస్తున్న కందికాయలు...
ఎన్నికలిపినా కంచంలో ఆ రుచులేవి !
" నమో వేంకటేశా... నమో తిరుమలేశా..."
టూరింగ్ టాకీసులో సినిమా మొదలవుతుంది
నాన్న భుజమ్మీద చంటి పిల్లాడినైపోవాలి
కానీ... అదిగో నాన్న వంట్లో మూలుగులన్నీ పీల్చేసి
చిన్నన్నయ్య జీవిత సారాన్నంతా తాగేసిన
కుమ్మనరాజు కొబ్బరితోట
దారి కడ్డంగా రక్తం తాగే రాక్షసిలా...!

-0-

ముఝె యాద్ రఖ్ నా :..

" పర్ దేశీ పర్ దేశీ జానా నహీ
ముఝె చోడ్ కే ముఝె చోడ్ కే...
పర్ దేశీ మేరీ యారా వాదా నిభానా
ముఝె యాద్ రఖ్ నా కహీ భూల్ నజానా..."
ఒక పాట ఎంతమందిక జీవనాధారం
ఒక పాట ఎంతమందికి జీవనోత్సాహం!
అలసి సొలసి
పయనించేవారిని అలసట తీర్చేది
ఓ సన్నజీర గొంతు, రెండు చిల్లపెంకుల్లో దూరి
గొప్ప ఆహ్లాదాన్నిచ్చేది
ప్రతీ సాయంత్రం

సంధ్య కిరణాల్ని చూడకపోయినా
పూడ్చలేని ఏదో వెలితిని తీర్చేది!
సృష్టి విచిత్రమయ్యిందే
పూవుల్లోని తాజాదనాన్నో
రంగుల్లోని మేళవింపునో
ప్రకృతిలోని కిలకిలరావల్నో
రాబట్టాలనెంత ప్రయత్నించినా
ఎక్కడో తొంగి చూసే కృత్రిమత్వమే!
" పర్ దేశీ పర్ దేశీ జానా నహీ
ముఝే చోడ్ కే ముఝే చోడ్ కే...
పర్ దేశీ మేరీ యారా వాదా నిభానా
ముఝే యాద్ రఖ్ నా కహీ భూల్ నజానా..."
ఆ గొంతులో దూరి అనుకరించినా
కళ్ళున్నవాళ్ళకీ కొత్త ప్రపంచాన్ని చూపే కొత్త పాటయ్యేది!

తొలిసారివిన్నప్పుడు
"పక్కబోగీలోకి పోతే బాగుణ్ణు' అనుకున్న
ఆ సహించలేని చెవులిప్పుడు
ఆ చేతి కర్ర మువ్వల చప్పుడు కోసమైనా వెతుకులాట!
పాడేదొకేపాట "పర్ దేశీ పర్ దేశీ...'
ఒక చరణమయ్యో, పల్లవయ్యో మాత్రమే
పైసాకోసం చాపే చేతిలో
ఇప్పుడెంత పెట్టాలన్నా ఎలాసాధ్యం ?
గడ్డిపోచకీ విలువుంటుంది
బతుకునెంత పరవశింపజేసింది

కోల్పోయినప్పుడే పాట విలువ తెలిసింది
ఇప్పుడెల్లే ఆ రైల్లో పాట కోల్పోయిన అనాథలెందరో!!
" పర్ దేశీ పర్ దేశీ జానా నహీ
ముఝే చోడ్ కే ముఝే చోడ్ కే...
పర్ దేశీ మేరీ యారా వాదా నిభానా
ముఝే యాద్ రఖ్ నా కహీ భూల్ నజానా..."

-0-

ఇలా వస్తువుని మనం కవిత్వీకరించే సామర్థ్యం ఉంటే దేన్నైనా కవిత్వంగా అందించవచ్చు. దేన్నైనా సృజనాత్మక రచనగా రూపొందించవచ్చు.

ఇప్పటికే రచనలు చేయడానికి కొన్ని మెళకువలను గ్రహించి ఉంటారనుకుంటున్నాను. ఇప్పుడు మీకు నచ్చిన ప్రక్రియలో కింది అంశాలలో ఒకదానిపై సృజనాత్మకంగా రాసే ప్రయత్నం చేయండి.

ఉదాహరణకు ఇప్పటివరకూ మనం విశ్లేషించుకున్న వస్తువు అమ్మ. ప్రతి జీవి పుట్టడానికీ కారణం అమ్మ.

అమ్మ గురించి ఒక ఛందోబద్ధంగా గాని, వచనంలో గానీ ఒక కవిత రాయండి. అలాగే నాన్న, గురువు, ఇష్టదైవం వంటి అంశాలపై రాయడం మొదలు పెట్టండి.

అలాగే ఇవే పద్ధతులను అనుసరిస్తూ నగరం, పట్టణం ఊరు వంటి వాటి గురించి రాయవచ్చు. వచన కవిత్వం గురించి ఆచార్య చేకూరి రామారావు ఆంధ్ర జ్యోతి ఆదివారం అనుబంధంలో వారం వారం రాసిన " చేరాతలు " గొప్ప ప్రేరకాలుగా నిలుస్తాయి. అదే పత్రికలో జి.లక్ష్మీనరసయ్య రాసిన కవిత్వ నిర్మాణ పద్ధతులు కూడా వచన కవిత్వంలో కనిపించే

శిల్పపద్ధతులను తెలుతున్నాయి. అవి పాశ్చాత్య సాహిత్య కోణంలో వచన కవిత్వాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపకరిస్తాయి.

అన్ని ప్రక్రియలనూ ఉదహరిస్తూ, వాటిని విశ్లేషించాలంటే పుస్తక విస్తృతి పెరిగిపోతుంది. అందువల్ల సంబంధిత ప్రక్రియకు చెందిన విశ్లేషణలను గమనించడం వల్ల సృజనాత్మక ఆసక్తినీ, ప్రతిభను మెరుగు పరుచుకోవచ్చు. డా. సి. నారాయణ రెడ్డి రాసిన పాటలను విశ్లేషిస్తూ "పాటలో ఏముంది, నా మాటలో ఏముంది" అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికంగా అనేక వ్యాసాలను రాశారు. వాటినిప్పుడు పుస్తక రూపంలో కూడా తీసుకొచ్చారు. పాటలు రాసే వారికీ గ్రంథం చాలా ఉపయోగపడుతుంది.అలాగే డా. చెన్నకేశవరెడ్డి గేయ సాహిత్యం పైనా; డా. మిరియాల రామకృష్ణ శ్రీ శ్రీ పైనా; వడ్డేపల్లి కృష్ణ గేయాలపైనా రాసిన సిద్ధాంత గ్రంథాలు పాటలు రాసే వారికి చాలా ఉపకరిస్తాయి.

కథకు సంబంధించి పోరంకి దక్షిణామూర్తి, కాళీపట్నం రామారావు, మధురాంతకం రాజారాం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, బి.ఎస్. రాములు తదితరులు ఎంతో మంది చక్కని వ్యాసాను రాశారు. పోరంకి దక్షిణామూర్తి "కథానికా స్వరూప స్వభావాలు" గ్రంథంలో కథకు సంబంధించిన అనేక లక్షణాలను సమన్వయిస్తూ రాశారు. వల్లంపాటి వెంకట సుబ్బయ్య "" కథా శిల్పం"లో మార్క్సిస్టు దృక్పథంలో కథా లక్షణాలను సమన్వయించు చూపారు.

మధురాంతకం రాజారాం తెలుగులో వచ్చిన అనేక మంచి కథలను సోదాహరణంగా విశ్లేషిస్తూ వ్యాసాలను రాశారు.

వీటిని మధురాంతకం నరేంద్ర సంపాదకుడుగా " మధురాంతకం రాజారాం కథాయాత్ర (తెలుగు కథానికా విమర్శలు పరామర్శలు పేరుతో చక్కని గ్రంథం వచ్చింది. యజ్ఞం కథ రాసిన కాళీపట్నం రామారావు అనేక కథలను వివరిస్తూ శిల్పపరమైన అంశాలను వివరించారు.

వీటితో పాటు వివిధ విశ్వవిద్యాలయాల్లో కథల పై చక్కని పరిశోధన గ్రంథాలు వస్తున్నాయి. వీటిలో ఒక్కొక్క రచయిత లేదా రచయిత్రికి సంబంధించిన కథలను విశ్లేషిస్తున్నారు. ఇవన్నీ కథను అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడే పుస్తకాలు.

వీటన్నింటికీ భిన్నంగా శార్వరి కథలను ఎలా రాయాలో చెప్తూ ప్రసిద్ధకథా రచయితల చేతనే వ్యాసాలు రాయించి అందుబాటులోకి తెచ్చారు. దీనిలో ఒకే ఇతివృత్తాన్ని తీసుకొని దాన్ని భిన్నమైన కోణాల్లో వివిధ రచయితలు కథగా రాయడాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించారు.

బి. ఎస్. రాములు " కథల బడి" లో అనేక కథలను విశ్లేషిస్తూనే, కథలను కాపీ (copy) కూడా ఎలా కొట్టవచ్చో చెప్పారు. నిజానికి నిజమైన జీవితాలను పరిశీలించేవారికి కథలను కాపీ చేయాల్సిన అవసరం లేదు. కానీ, చాలా మంది ఇతర భాషల నుండీ, ఇతర కథల నుండీ ఇలాంటి చౌర్యం చేస్తుంటారు. అవన్నీ తమ తెలివి తేటలతో కప్పి పుచ్చుకుంటారు. ఒకే కథను కాపీ చేసి కూడా కొత్త కథగా మురిపిస్తుంటారు. కాబట్టి కథ గానీ, నవల గానీ, కవితగానీ రాయడంలో నైపుణ్యం సాధిస్తే ఇతివృత్తానికి కొదవే ఉండదని బి.ఎస్. రాములు గారి ఉద్దేశం కావచ్చు.

పరుచూరి గోపాల కృష్ణ తన సిద్ధాంత గ్రంథం " తెలుగు సినిమా సాహిత్యం, కథ కథన శిల్పం" లో ఇంతవరకూ మనం చెప్పుకున్న వారి విశ్లేషణలను ఉపయోగిస్తూనే, సినిమాల్లో స్క్రిప్టు రైటింగ్ ఉండే విధానాన్ని తెలిపారు. ఇది కథను దృశ్యీకరించేటప్పుడు రచయిత తీసుకోవలసిన అనేక కొత్త అంశాలను తెలియజేస్తుంది.

మళ్ళీ కలుసుకుందాం!

నిజానికి సృజనాత్మక రచనలు చేయడం అనేది చాలా బాధ్యతతో కూడిన పని. మొదట్లో సరదాగా ప్రారంభించినా తర్వాత తర్వాత అది పాఠకుల్లో చర్చల స్థాయికి వెళ్ళేసరికి

అదొక బాధ్యత అని తెలిసి వస్తుంది.అప్పుడే రచయితలో ఒక ప్రాపంచిక దృక్పథానికి సంబంధించిన అలోచన మొదలవుతుంది.

కవికి ప్రతీదీ వస్తువు ఎలా అవుతుందో, దాన్ని కావాలంటే అంత గుప్తంగానూ వర్ణించగలుగుతాడు. దీన్నే మన లాక్షణికులు రకరకాల ధ్వనులుగా చెప్తారు.

కవి తన అనుభవాన్ని విశ్వజనీనం చేయగలుగుతాడు. కథకుడు కూడా వివిధ పాత్రలతో దాన్ని సాధించగలుగుతాడు. కవిత్వంలో ప్రతి పదం స్పందన, భావుకత, స్మరణీయత, సంవేదనలతో కూడి ఉంటుంది.

గేయంలో లయ ప్రాధాన్యాన్ని వహించడం, దానితో పాటు శైలి అత్యంత ముఖ్యంగా మారిపోతుంది. ఆలాపన వల్లనే దాని శక్తి శ్రోతల్లో గాఢంగా ముద్రవేస్తుంది. అందువల్ల ఆలపించే వారి శక్తి సామర్థ్యాలు, ఆ గొంతులోని మాధుర్యం గేయంలో సృజన శాశ్వతంగా నిలిచిపోతుంది.

కథలో దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఒకటి రెండు సంఘటనల చుట్టూనే కల్పన కొనసాగినా, జీవన వాస్తవితత వల్ల జీవితాంతం అది పాఠకుని మనసులో మెదులుతుంది.

ఒక జీవితం చుట్టూ అనేక జీవన దృశ్యాలను నవలలో ఆవిష్కరించగలిగే అవకాశం ఉంది. విశాలమైన కాన్వాస్ ని తీసుకోగలిగే అవకాశం ఉంది. కానీ, తాను చెప్పబోయే సందేశం ప్రధానంగా ఒక పాత్రలోనే కాకుండా, అనేక పాత్రల్లో కూడా పెట్టగలిగే అవకాశం ఉంది.

నాటకంలో అభినయం, సంభాషణలదే ప్రాధాన్యం. దృశ్య నాటకం శ్రవ్య నాటకంగా మారేటప్పటికి సృజన కారుడు

కవిగా, కథకుడుగా కూడా మారిపోతుంటాడు.

ఈ సృజనాత్మక ప్రక్రియల ద్వారా తమ ఇష్టాయిష్టాలను, కోపతాపాలను కూడా నెరవేర్చుకోగలిగిన వాళ్ళున్నారు. అప్పుడప్పుడూ కథల్లో, నవలల్లో కొన్ని సన్నివేశాల ద్వారా, కొన్ని పాత్రల ద్వారా, కొన్ని ప్రత్యేక వాడుక భాషా పదాల, సంభాషణల ద్వారా తమ ప్రతీకారాలను, అభినందనలను, ఆకాంక్షలను నెరవేర్చు కుంటుంటారు.

ఫలానా వస్తువుకి లేదా ఫలానా పాత్రకు మీకున్న ప్రేరణ చెప్పమని అడిగితే కొంతమంది మాత్రమే చెప్పడానికి ఇష్టపడుతుంటారు. చాలా మంది తమ ఆత్మకథల్లోనే రాసుకుంటారు. మరికొంతమందైతే అసలు బహిర్గతం చేయడానికి మనస్కరించరు. వాటి గురించి వచ్చిన విశ్లేషణలు చూసినప్పుడు ఒక చిరునవ్వు నవ్వుకొనే వాళ్ళు కూడా ఉంటారు. ఇవన్నీ తెలియాలంటే ఆ సృజనకారుని వ్యక్తిగత జీవితంతో బాగా అనుబంధాన్ని పెనవేసుకొన్నప్పుడు మాత్రమే సాధ్యం.

సృజనకారుడు మరణించిన తర్వాత ఆతని రచనల్లో గల వస్తువుకీ, పాత్రలకీ, సంభాషణకీ, సన్నివేశ చిత్రణకీ కూడా గల సంబంధం దినచర్యల్లోనూ, ఉత్తరాల్లోనూ, రాసుకున్న చిత్తుప్రతుల్లోనూ, ఇంటర్వ్యూల్లోనూ బయటపడే అవకాశం ఉంది. అప్పుడూ బయటపడకపోతే వాళ్ళతో ఉండే సన్నిహితులు, కుటుంబసభ్యులను బట్టి కూడా తెలుసుకొనే అవకాశం ఉంది. ఇదంతా చర్చించుకోవడం ఎందుకంటే, సృజనకారుడు కూడా మనిషే. అతనికీ అనుభవాలు ఉంటాయి. అనుభూతులు ఉంటాయి. ఇవన్నీ తన రచనల్లో చేరతాయి.

కాబట్టి జీవన సత్యదర్శనమే అత్యధిక శాతం సృజన సాహిత్యంలోనూ ప్రతిఫలిస్తుంది. తమ జీవితానుభవాలనే రచనలుగా రాయవచ్చున్నమాట!

అన్నీ తెలిసిన వాడు అత్యంత మౌనంగా ఉంటాడని లోకంలో ఒక నానుడి ఉంది. నిజానికి అన్నీ తెలిసిన వాడు మానవేతరుడై ఉంటాడేమో అనుకోవచ్చు. అనుభూతికి గురి కాని వాళ్ళున్నట్లే, అనుభూతిని ఏదో విధంగా వ్యక్తం చేయనివాళ్ళూ ఉండరు. అయితే అది ఒక కళగా పరిణమించాలంటే కొన్ని నియమాలకు లోబడక తప్పదు.

మనం ఏ ప్రక్రియలో రచనలు చేయాలనుకుంటున్నామో ఆ ప్రక్రియకు సంబంధించిన రచనలను చదవాలి. ఆ రచనలపై వస్తున్న విశ్లేషణలను పరిశీలిస్తుండాలి. ఆ నియమాలకు లొంగకుండా కొత్త దారుల్లో పయనిస్తూ కూడా ఆహ్లాదపరుస్తూ రచనలు చేసే వాళ్ళున్నారు. అందుకే ...

" నియతి కృత నియమ రహితాం!

హ్లాదైక మయీ మనన్య పరతంత్రాం

నవరసరుచిరాం నిర్మితి

మాదధతీ భారతీ కవేర్జయతి" అని మన భారతీయ లాక్ష ణికులు కవిని బ్రహ్మతో సరిసమానంగా భావించారు. ఇక్కడ కవి అంటే సృజనకారుడని అర్థం చేసుకున్నప్పుడు, సృజన కారుడు తనకి నచ్చినట్లు కొత్త నియమాలతో కూడా పాఠకుల్ని రంజింపచేయగలుగుతాడు. ప్రయోగాలు చేయాలంటే సంబంధిత రచనా ప్రక్రియలో విశేషమైన అనుభవం ఉండాలి. అప్పుడే అది మరో రచనకు మార్గం వేస్తుంది. అనేకమందిపై ప్రభావం చూపుతుంది.

ఈ పుస్తకంలో కేవలం నేను గమనించిన కొన్ని అంశాలను మాత్రమే చెప్పాను. ఇవి మీకేమాత్రం ఉపయోగపడినా నాకు అంతకు మించిన ఆనందం మరేదీ ఉండదు. ఈ పుస్తకం చదివిన తర్వాత రోజూ మీరూ దినచర్య రాసినా మీలో గొప్ప సృజనకారుణ్ణి మేలుకొల్పిన పుస్తకమే అవుతుంది. అలాంటి వాళ్ళమంతా మళ్ళీ కలుసుకుందాం. కలుసుకోవడమంటే ఒక కథకుడు గానో, ఒక కవిగానో కలుసుకుందాం. మన అనుభవాలను పెనవేసుకుందాం. మనం గమనించిన వాటిని మళ్ళీ మళ్ళీ స్మరించుకుని మన విజ్ఞానాన్ని విస్తరించుకుందాం!

" జయంతితే సుకృతినో రససిద్ధా కవీశ్వరా

ఉపయుక్త గ్రంథసూచిక

ఆరుద్ర. సమగ్ర ఆంధ్ర సాహిత్యం.విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్, జూలై 1989- సెప్టెంబర్ 1991. (తొలి ముద్రణ: 1965)

ఇనాక్, కొలకలూరి. తెలుగు వ్యాసపరిణామం, అనంతపురం : జ్యోతి గ్రంథమాల, 1980.

ఈశ్వరరావు, సెట్టి (సంపా.) గురజాడ జాబులు-జవాబులు దినచర్యలు, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ ప్రచురణలు. 2000.

గోపాల కృష్ణ, పరుచూరి. తెలుగు సినిమా సాహిత్యం, కథ, కథనశిల్పం, హైదరాబాదు: వీ-టెక్ పబ్లికేషన్స్, 2003.

చెన్నకేశవ రెడ్డి, జి. ఆధునికాంధ్ర గేయకవిత్వం, హైదరాబాదు: జయమిత్ర పబ్లికేషన్స్, 1988.

ధర్మేశ్వరరావు, గాదె. తెలుగులో చిత్రకవిత్వం, అమరావతి: రాజ్యలక్ష్మి పబ్లికేషన్స్, 1986.

నరేంద్ర, మధురాంతకం (సంపా.) మధురాంతకం రాజారాం కథాయాత్ర (తెలుగు కథా విమర్శకులు- పరామర్శలు). హైదరాబాదు: అజో-విబో ప్రచురణలు, 2000.

నారాయణరెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు: ప్రయోగములు. సికింద్రాబాదు : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ , 1967.

ప్రసాద్, ఏటుకూరి (సంపా.) పొయిట్రీ వర్క్ షాప్(శతాధిక కవుల చేతిరాతల కవితా సంకలనం: 1862-1962), హైదరాబాద్: శ్రీశ్రీ స్మారక సంస్థ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, 1993.

రామ మోహనరాయ్. తెలుగు కవితా వికాసం (1947-1980), హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1982.

రాములు, బి.ఎస్. కథల బడి : కథా సాహిత్య అలంకార శాస్త్రం. 1998. హైదరాబాదు : విశాల సాహిత్య అకాడమి.
శరత్ జ్యోత్స్నారాణి. ఎస్. స్వాతంత్ర్యానంతర కవిత్వం: వస్తువు-రూపం- శిల్పం. హైదరాబాదు: స్వీయప్రచురణ, 2003.
శార్వరి. కథలెలా రాస్తారు? హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1992.
వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. నవలా శిల్పం. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1994.(ప్ర. ము:1989)
వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథా శిల్పం. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2000.(ప్ర. ము:1995).
వెంకటేశ్వరరావు, దార్ల. అనంతజ్యోతి కళాశాల వార్షిక సంచికలు, వికారాబాదు: శ్రీ అనంత పద్మనాభ కళాశాల. 2001 -02; 2002-03; 2003-4.
శిఖామణి (ప్ర. సంపా.) అమ్మ (అమ్మపై నూట పద్దెనిమిది హృదయ స్పందనలు). హైదరాబాదు: రంజని తెలుగు సాహితీ సమితి, 1997.
సూర్యనారాయణ, సన్నిధానము (వివరణ కర్త), కావ్యాలంకార సంగ్రహము, సికింద్రాబాదు: యం.శేషాచలం అండ్ కంపెనీ. 1976. (మొదటి ముద్రణ: 1945)
Dawson, Paul. Creative Writing and the New Humanities London ; New York : Routledge, 2005.
www.wikipedia.com

రచయిత పరిచయం

పూర్తి పేరు : దార్ల వెంకటేశ్వరరావు
పుట్టిన ఊరు : చెయ్యేరు అగ్రహారం,
కాట్రేనికోన మండలం,
తూర్పు గోదావరి జిల్లా.
ప్రస్తుత ఉద్యోగం: లెక్చరర్, తెలుగు శాఖ,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.
పుట్టిన తేది : 05 09 1973
తల్లిదండ్రులు : పెదనాగమ్మ,లంకయ్య
చదువు : బి.ఏ.(స్పెషల్‌తెలుగు)
(ఆంధ్ర యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్)
యస్.కె.బి.ఆర్. కళాశాల, అమలాపురం.
డిప్లొమా(సంస్కృతం), నిజాం కళాశాల,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి. (తెలుగు)
హైదరాబాదు విశ్వవిద్యాలయం.
ఎం.ఏ. (సమాజశాస్త్రం)డా॥బి.ఆర్. అంబేద్కర్
సార్వత్రిక విశ్వవిద్యాలయం.
పరిశోధన : ఎం.ఫిల్. (డా॥ యస్.టి. జ్ఞానానందకవి గారి
ఆమ్రపాలి పరిశీలన) 1998
పిహెచ్.డి. (పరిశోధకుడుగా ఆరుద్ర) 2003.
పరిశోధన ఆసక్తి : సాహిత్య విమర్శ, సౌందర్య శాస్త్రం,
మాదిగ సాహిత్యం.

రచనల వివరాలు:

1. మాదిగ చైతన్యం (ఉప సంపాదకత్వం) 1997
2. సాహితీ మూర్తుల ప్రశస్తి (సహాయ సంకలన కర్త) 1997
3. డా|| యస్.టి. జ్ఞానానందకవి ఆమ్రపాలి పరిశీలన 1999
4. దళిత తాత్వికుడు (కవితా సంపుటి) 2004

పురస్కారాలు:

కళాప్రపూర్ణ జయంతి రామయ్య పంతులు స్మారక బహుమతి (1995), కందుకూరి వీరేశలింగం పంతులు, రాజ్యలక్ష్మి స్మారక బహుమతి (1995), నండూరి వెంకటరామయ్య & కుటుంబ లక్ష్మి స్మారక బహుమతి (1995), భారతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర శాఖ, రాజమండ్రి (1996).

సాధించినవి మరి కొన్ని:

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారి పరీక్ష ద్వారా స్లెట్ ఉత్తీర్ణత. రాత పరీక్ష ద్వారా యు.జి.సి. వారి నెట్ & రీసెర్చ్ ఫెలోషిప్ సాధించడం. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారి పరీక్ష ద్వారా గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక. శ్రీ అనంత పద్మ నాభ (యు.జి.సి. ఎయిడెడ్) కళాశాల, వికారాబాదులో మూడేళ్ళ పాటు తెలుగు లెక్చరర్. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం, యువవాణి విభాగంలో కొంతకాలం పాటు క్యాంపియర్. జాగృతి ఐ.ఏ.ఎస్. స్టడీ సర్కిల్ లో కొంత కాలం లెక్చరర్. సహాయ కార్యదర్శి, జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాదు. ప్రధాన కార్యదర్శి, తెలుగు సాహిత్య వేదిక, హైదరాబాదు.